

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :60 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ సోమవారం - 07 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## ఏపీలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

మరో 3 గంటల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాల హెచ్చరిక

గంటకు 50 నుంచి 60 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుంది. రాబోయే మూడు గంటల్లో ఏడు జిల్లాల్లో తీవ్రమైన ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని మిగతా..2లో

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా, ఆరుగురిని కాపాడిన సహాయక బృందాలు



మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి

ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మిగతా..2లో

## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడాలి



2

★ సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

★ ఇప్పటిదాకా ఈ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల భూములను 22 ఏలో పెట్టలేదని తెలిపారు.

సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 6 : సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావుఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా ఈ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల భూములను 22 ఏలో పెట్టలేదని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఎంపీ రఘునందన్ రావు ఈరోజు (ఆదివారం) పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ప్రజల భూములను ఈ రోజు దాకా దేశంలో ఏ ప్రభుత్వం కూడా చివరకు ఇందిరా గాంధీ హయాంలో

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన

# డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్

- ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం
- హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్ : కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చించారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారు మిగతా..2లో

## కొడంగల్‌పై కవిత ఫోకస్.. కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ



2

- తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత కొడంగల్‌పై ఫోకస్ పెట్టారు.
- కొడంగల్ కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పాంచజన్య శంఖారావం చేపడుతున్నట్లు ప్రకటించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత కొడంగల్‌పై ఫోకస్ పెట్టారు. కొడంగల్ కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పాంచజన్య శంఖారావం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈనెల 23వ తేదీన కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు (ఆదివారం) తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో

## అందనంత దూరంలో మీరు అందుకే ప్రచారాలు అవసరం'

★ ప్రధాని మోదీ 'యాంగ్రీ అంకుల్ ' వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్



ఢిల్లి : ప్రధాని నరేంద్ర మోదీ 'యాంగ్రీ అంకుల్ ' వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో మాట్లాడిన ప్రధాని మోదీ విద్య, ఉద్యోగాలు, యువజన సంక్షేమం గురించి మాట్లాడకుండా, దానిని రాజకీయ ప్రచారంగా మార్చేశారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై రాజకీయ ముద్రలు వేస్తున్నారని విమర్శించారు. విమర్శనాత్మక ప్రశ్నలను అణచివేయడానికి, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి విపక్షాలను కించపరిచే విశేషణాలను వాడడం ఆయనకు అలవాటుగా మారిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. "ప్రధాని మోదీ- మీరు నిన్న ఢిల్లీ యూనివర్సిటీలోని ఎస్ ఆర్ సీసీని సందర్శించారు. దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై మాట్లాడడానికి అది ఒక మంచి అవకాశం. కానీ మీరు యువత వేసే ప్రశ్నలను ఎదుర్కొనేందుకు బదులుగా, మీ ప్రసంగం కాస్త మరో రాజకీయ ప్రచారంగా మార్చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణచివేయడానికి, సొంత వైఫల్యాలను దాచడానికి మీరు ప్రతిపక్షాలకు కొత్త విశేషణాలను సృష్టిస్తున్నారు. నారాజ్ ఫూఫా (కోపదారి మేనమామ), దిమాగీ నక్సల్ , అర్బన్ నక్సల్ , ఖాన్ మార్కెట్ గ్యాంగ్ , ఆందోళనజీవి, పరాన్నజీవి ఇలా చాలా విశేషణాలు మారుతూ ఉన్నప్పటికీ, మీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు మాత్రం మారడం లేదు." మిగతా..2లో

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తెలుగు టీచర్ ప్రకాశరావు!




- న్యూఢిల్లీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా
- తండ్రి ఉద్యోగరీత్యా అండమాన్‌కు వెళ్లిన ప్రకాశరావు అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు.

కోనసీమ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం చెన్నడం గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు జల్లి ప్రకాశరావు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. న్యూఢిల్లీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తండ్రి ఉద్యోగరీత్యా అండమాన్‌కు వెళ్లిన ప్రకాశరావు మిగతా..2లో

## 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

- డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం
- 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యం!



ఢిల్లి : డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు. "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్ ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం మిగతా..2లో

## హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




2

★ హైదరాబాద్ మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఏర్పాటు

★ అహింస బలహీనత కాదని, అదొక గొప్ప బలమని కిషన్ రెడ్డి వ్యాఖ్య

★ స్థూపం ఏర్పాటులో చొరవ తీసుకున్న జైన మహిళలను కొనియాడిన కేంద్రమంత్రి

★ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఐక్యత అవసరమని పిలుపు

★ సాంకేతికతతో పాటు సాంస్కృతిక విలువలను కాపాడుకోవాలని యువతకు హితవు

# ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు భారత్ ఓకే...

- ప్రపంచ పటాల మార్పుపై ఐరాస తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు
- ప్రస్తుత మ్యాప్ ల్లో ఖండాల సైజులు తప్పుగా ఉన్నాయని పేర్కొన్న తీర్మానం
- ఏ ఒక్క నిర్దిష్ట మ్యాప్ నూ ఆమోదించడం లేదని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం
- సరిహద్దులు, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీపడేది లేదని తేల్చిచెప్పిన వైనం
- జమ్మూకశ్మీర్, లధఖ్‌లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపాలని పట్టు



ఢిల్లి : ప్రపంచ పటాల (వరల్డ్ మ్యాప్) విషయంలో ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభలో ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానానికి భారత్ మద్దతు పలికింది. ప్రపంచ పటాల్లో ఖండాలు, దేశాల సైజులను మరింత కచ్చితంగా, యధార్థంగా చూపించాలన్న ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసింది. అయితే, ఈ మద్దతుకు తమ షరతులు వర్తిస్తాయని, దేశ సార్వభౌమాధికారం, సరిహద్దుల విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని గట్టిగా స్పష్టం చేసింది. మిగతా..2లో

## శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల భద్రతపై టీటీడీ సీవీఎస్‌వో



- ధ్వజారోహణం రోజున సీఎం చంద్రబాబు పర్యటన కారణంగా ప్రత్యేక బందోబస్తు
- భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పటిష్ఠమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు.

అమరావతి : తిరుమలలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిగతా..2లో

# ఏపీలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

విపత్తుల నిర్వహణ సంస్థ తన ప్రకటనలో పేర్కొంది. వర్ష తీవ్రత, పిడుగుపాటు ప్రమాదం అధికంగా ఉండటంతో ఇంతకుముందు జారీ చేసిన ఆరెంజ్ అలర్ట్‌ను తాజాగా రెడ్ అలర్ట్‌గా సవరించినట్లు వెల్లడించింది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పుల దృష్ట్యా ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు కోరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్లు, విద్యుత్ స్తంభాల కింద, శిథిల భవనాల్లో ఆశ్రయం పొందవద్దని హెచ్చరించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది“ అని అమిత్ షా అన్నారు. పక్కా ప్లాన్ తో డ్రగ్స్ నివారణ 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్ వర్క్ ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్ ఫోర్స్ లను (ఏఎన్ టీఎఫ్ ) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్ ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు. “మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్ , పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్ కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్ లైన్ ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది“ అని అమిత్ షా స్పష్టం చేశారు.

### మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

### నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. “తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్ ' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం“ అని అమిత్ షా స్పష్టం చేశారు.

### పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్ వర్క్ లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్ -మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తెలుగు టీచర్ ప్రకాశరావు!

అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. అండమాన్ నికోబార్ దీవుల్లో తెలుగు బోధనతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి విశేష సేవలందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయనకు పురస్కారం లభించడంతో చెన్నడం గ్రామస్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# కొడంగల్‌పై కవిత ఫోకస్..

# కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ

పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

### బహుజన తెలంగాణ సాధనే మా లక్ష్యం..

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని కవిత విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో సగం కూడా ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. బహుజన తెలంగాణ సాధనే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. తెలంగాణ రక్షణ సేనలో బీజేపీ కొడంగల్ ఇన్‌చార్జి ప్రభాకర్ కులకర్ణి చేరారు. కులకర్ణితో పాటు ఆయన అనుచరులకు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ కోసం పనిచేస్తానని ప్రభాకర్ కులకర్ణి పేర్కొన్నారు.

# ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు భారత్ ఓకే...

శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న 'మెర్కేటర్ ప్రొజెక్షన్' మ్యాప్ ల్లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. ఉదాహరణకు, ఆఫ్రికా కంటే 14 రెట్లు చిన్నదైన గ్రీన్‌ల్యాండ్, ఈ మ్యాప్ ల్లో దాదాపు ఆఫ్రికా సైజులోనే కనిపిస్తుంది. ఈ వక్రీకరణను సరిదిద్దేందుకు 'ఈక్వల్-ఏరియా' (సమాన విస్తీర్ణం) ప్రొజెక్షన్‌లను ప్రోత్సహించాలని కోరుతూ 'కరెక్ట్ ది మ్యాప్' పేరుతో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల ఆఫ్రికా, భారత్ వంటి గ్లోబల్ సౌత్ దేశాలు వాటి వాస్తవ పరిమాణంలో కనిపిస్తాయి. సెప్టెంబర్ 4న జరిగిన ఓటింగ్‌లో ఈ తీర్మానానికి అనుకూలంగా 164 దేశాలు ఓటు వేయగా, అమెరికా వ్యతిరేకించింది. మరో 6 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఈ ఓటింగ్‌పై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. ఖండాల వాస్తవ పరిమాణాన్ని చూపించే సూత్రానికి మాత్రమే తాము మద్దతిస్తున్నామని, దీనివల్ల ఏదో ఒక నిర్దిష్ట మ్యాప్ ను (ఈక్వల్ ఎర్త్ వంటివి) ఆమోదిస్తున్నట్లు కాదని తెలిపారు. ఈ తీర్మానానికి, రాజకీయ సరిహద్దులకు, వివాదాస్పద ప్రాంతాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని భారత్ తేల్చిచెప్పింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లధఖ్‌లతో కూడిన భారత భూభాగాన్ని, దేశ అధికారిక మ్యాప్ ప్రకారమే కచ్చితంగా చూపించాలని ఉద్ఘాటించింది. దీనికి భిన్నంగా చిత్రీకరించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అంగీకరించబోమని పేర్కొంది. ఈ తీర్మానం దేశాలపై చట్టపరంగా తప్పనిసరి కానప్పటికీ, వాస్తవ సైజులు ముఖ్యమైన చోట ఈక్వల్-ఏరియా మ్యాప్ లను వాడాలని ప్రభుత్వాలను, సంస్థలను ప్రోత్సహిస్తుంది.

# ఒళ్లంతా అవినీతి బురదే!

భారతావని సమైక్యతను పరిరక్షించే ఉక్కుచట్రంగా సివిల్ సర్వీసులు వెలుగొందాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశించారు. కానీ, ప్రజాసేవను పక్కనపెట్టి తప్పుడుదోవల్లో తమ జేబులు నింపుకోవడానికి తహతహలాడుతున్న కొందరు అవినీతి ఉన్నతాధికారుల పుణ్యమా అని ఆ ఉక్కుచట్రం క్రమంగా తుప్పుపడుతోంది. లంచాల మేతలకు అలవాటుపడిన పెద్దమనుషుల దెబ్బకు తన స్వరూప స్వభావాలనే కోల్పోతోంది. ఉద్యోగంలోకి రాకముందు సమాజ సేవకుల్లా నీతిసూత్రాలు చెబుతూ రాజ్యాంగ విధేయత, పారదర్శక పాలన, పేదరిక నిర్మూలన అంటూ తెగ కలవరించే కొంతమంది- సివిల్ సర్వీసుల్లోకి రాగానే ఆదర్శాలకు చెల్లుచీటీ రాస్తున్నారు. నిర్లజ్జగా అక్రమాలకు పాల్పడుతూ ఉన్నతాధికార స్థానాలపై సమాజంలో ఉండే గౌరవమర్యాదలను నీరుగారుస్తున్నారు. మంచి వేతనం, పెద్ద బంగ్లా, కారు, భద్రత, వ్యక్తిగత సిబ్బంది... అసలు ఐఏఎస్, ఐపీఎస్ అంటేనే ఆ దర్జానే వేరు. ఆ ఆర్భాటాల మాయలో పడిన వారు ప్రజలకు దూరమవుతారు. అలాకాకుండా తమ చేతిలోని అధికారాన్ని సామాన్యుల కోసం సద్వినియోగం చేస్తే, జనం వారిని గుండెల్లో పెట్టుకుంటారు. కానీ, అలా సమాజానికి ఉపయోగపడదామన్న ఆలోచనే కొందరిలో ఉండట్లేదు. అరుదైన అవకాశాన్ని అందించిన దేశానికి రుణపడి ఉంటూ పేదసాదల బతుకులను మార్చడానికి తామేం చేయాలన్న తలపును కూడా వారు దగ్గరికి రానివ్వట్లేదు. ఎంతసేపూ ఎంతెంత సంపదను కూడగట్టుకుందామా అన్నదానిపైనే వాళ్ల దృష్టి అంతా ఉంటోంది. హరియాణాలో భారీ ఆర్థిక నేరం కేసులో సీబీఐ తాజాగా ఆరుగురు ఐఏఎస్‌లపై మూడో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో బ్యాంకు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందితో ఐఏఎస్‌లు కుమ్మక్కు అయ్యి హరియాణా ప్రభుత్వ శాఖలు, సంస్థలకు చెందిన దాదాపు ఆరు వందల కోట్ల రూపాయల నిధులను దారిమళ్లించారని చెబుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది సక్రమ మార్గంలో నడిచేలా చూడాల్సినవారే ఇలా బుద్ధిగడ్డి తిని ప్రజాధనాన్ని స్వాహా చేయడమెంత సిగ్గుచేటు! రాజస్థాన్ జల్‌జీవన్ మిషన్ టెండర్లలో అవకతవకలకు పాల్పడ్డారంటూ మాజీ ఐఏఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్‌ను ఏసీబీ ఇటీవల అరెస్టు చేసింది. గతంలో ఈయన అదనపు ప్రత్యేక కార్యదర్శిగా ఉద్యోగం వెలగబెట్టారు. అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాక చాలారోజులు పరారీలో ఉన్నారు. అడుసు తొక్కనేల.. కాలు కడగనేల అన్నట్లు అడ్డగోలు మార్గాల్లో డబ్బు వెనకేసుకోవడానికి అర్రులుచాచకుండా ఉంటే దొంగలా బతకాల్సిన అగత్యం తప్పేది కదా! కర్ణాటకలో పశువైద్యాధికారుల పోస్టుల మంజూరుకు లంచాలు కతికిన కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్రకుమార్‌ను సీఐడీ అదుపులోకి తీసుకుంది. అయిదు వేల కోట్ల రూపాయల నకిలీ మందుల రాకెట్ దర్యాప్తును ఒక వ్యాపారికి అనుకూలంగా మార్చేందుకు రూ.3కోట్ల లంచం అడిగిన ఆరోపణ మీద హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లావత్‌ను మొన్న జులైలో సీబీఐ అరెస్టు చేసింది. సామాన్య ప్రజల ప్రాణాలతో ముడిపడిన కేసులోనూ ఇలా అవినీతి దారులు వెతకడం ఎంత హేయం!

# అందనంత దూరంలో మీరు- అందుకే ప్రచారాలు అవసరం'

మొదటి పేజి తరువాయి



మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు
ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

యువత రిపోర్ట్ కార్డులో పెరుగుతున్న నిరుద్యోగం, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్ లు, ఖరీదైన విద్య, తగ్గిపోతున్న స్కాలర్ షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి లాంటివి ఉన్నాయని ఖర్గే పేర్కొన్నారు. “మోదీ- మీరు అందనంత దూరంలో ఉన్నప్పుడే మీకు ప్రత్యేక పరిచయ కార్యక్రమం అవసరం అవుతుంది. మోదీ తన రిపోర్టు కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్టు కార్డుతో సిద్ధంగా ఉంది. ఆ రిపోర్టు కార్డులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్ లతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ ఖరీదు అవుతున్న విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి మొదలైనవి ఉన్నాయి. అందుకే విద్యార్థుల గొంతుక వినండి. సమస్యను పక్కదారి పట్టించడం వల్ల అవి పరిష్కారం కావు“ అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం ప్రధాని మోదీ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించేవారిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారిని 'యాంగ్రీ అంకుల్స్ ' అని అభివర్ణించారు. మోదీ ఎస్ ఆర్ సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, “ఈ క్యాంపస్ వెలుపల, మీకు ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. మీరు రెండు రకాల వ్యక్తులను కలుస్తారు. మొదటి రకం వారు సమాజం శక్తిని దేశ శక్తిగా మార్చే వ్యక్తులు. ఇక రెండో రకం వాళ్లు ఏ పని ప్రారంభమైనా యాంగ్రీ అంకుల్ లాగా మారిపోతారు. ప్రతి పనిని వ్యతిరేకించడమే వారి పని. వారికి ఒకే ఒక డైలాగు తెలుసు- 'దీని అవసరం ఏముంది?'. మేము ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) నిర్మిస్తున్నప్పుడు, కొందరు పూఫాలు (అసంతృప్తితో ఉండే బంధువులు) దీని అవసరం ఏముందని అన్నారు. మేము హైస్పీడ్ రైళ్లు, యూపీఐ ప్రారంభించినప్పుడు కూడా అలానే అన్నారు. కానీ వారందరికీ భారతదేశం తగిన సమాధానం ఇచ్చింది. దేశానికి అవసరమైన పనిని చేయడానికి భారతదేశాన్ని ఎవరూ అపలేరు“ అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీపై ఖర్గే విమర్శలు గుప్పించారు.

# తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు - పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

మొదటి పేజి తరువాయి

స్వామివారిని దర్శించుకుని, వాహన సేవలను తిలకించేలా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల నాలుగు మాడ వీధులతో పాటు, భక్తులు రద్దీగా ఉండే ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీఎస్‌వో మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పటిష్ఠమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పిస్తారని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తుమన్నామన్నారు. ధ్వజారోహణం రోజున సీఎం పర్యటన: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 15న ధ్వజారోహణం సేవ జరగనుంది. ఆ రోజున సీఎం చంద్రబాబు తిరుమలకు విచ్చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక బందోబస్తుతో పాటు అవసరమైన చోట్ల బ్యారికేడింగ్‌ను నిర్మిస్తున్నారు. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గరుడ సేవకు భారీ ఏర్పాట్లు: సెప్టెంబర్ 19న గరుడసేవకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. అందువల్ల తిరుమల, తిరుపతిలోని పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సీవీఎస్వో తెలిపారు. వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ట్రాఫిక్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అలాగే, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సులభంగా మార్గనిర్దేశం చేసేందుకు తిరుమల, తిరుపతి ప్రధాన కూడళ్లలో వివిధ భాషల్లో సైన్ బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా పటిష్ఠ బందోబస్తు: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. భక్తుల భద్రతతో పాటు క్రైమ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, ఫైర్, ఫారెస్టు, ఇంటెలిజెన్స్, ఆర్టీసీ, రైల్వే తదితర శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాల సమయంలో భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల షెడ్యూల్ :



ఈ ఏడాది అధిక మాసం కారణంగా తిరుమలలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింపజేయనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబరు 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించనున్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్

మొదటి పేజి తరువాయి

: తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్ , అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం చేస్తున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలి : కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని, నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని



ఆదేశించారు. సమావేశంలో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు. ఉభయసభల్లో ఎండగట్టాలి : అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ఉభయసభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు.

అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని వెల్లడించారు.

కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడాలి

కూడా 22 ఏ లో పెట్టలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని దళిత, గిరిజనుల, నోరు లేని అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహించారు. దాదాపు లక్ష కోట్ల పేదల భూములను 22ఏలో పెట్టీ భారీ కుంభకోణానికి తెర లేపారని ఆరోపించారు. లక్ష కోట్ల భూముల పంచాయితీలో పైసలు పంచుకుంటున్న మంత్రులు ఎవరో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లేదా ఈ పైసలన్నీ తన ఖాతాలోనే వేసుకుంటానని అనుకుంటే సీఎం అయినా దీనికి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. 22 ఏ లో పేదల భూములను పెట్టొద్దని.. అవి తాతల కాలం నాటి నుంచి వస్తున్న ఆస్తులని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఈసారి జరిగే శాసనసభ సమావేశాలకు హాజరు కావాలని కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడితే వారికి గౌరవం ఉంటుందని రఘునందన్ రావు సూచించారు.

# ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

మొదటి పేజి తరువాయి

ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. “ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి“ అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. “ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి“ అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు. సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, “భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు



భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం“ అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

ఢిల్లి : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరోపగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు. భారత్ ఎల్లప్పుడూ అహింసా మార్గాన్నే అనుసరించిందని, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అహింస అనేది బలహీనత కాదని, అదొక గొప్ప బలమని అన్నారు. అహింసా స్థూపం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం ద్వారా 'నారీశక్తి' స్ఫూర్తిని, మహిళా నేతృత్వంలో




జరుగుతున్న అభివృద్ధిని ఇది ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జైన సమాజ మహిళలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలే అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నారని, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' ఇందుకు నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ విభిన్న సంస్కృతులకు నిలయమని, నగరం సాధిస్తున్న ప్రగతి వెనుక ఈ వైవిధ్యమే కీలక శక్తిగా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలో జైన, బ్రాహ్మణ, మహేశ్వరి వంటి వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధితో పాటు వారసత్వం) అనే స్ఫూర్తితో 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో హైదరాబాద్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న స్వార్థ శక్తులను ఓడించడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటి యువత (జెన్-జీ) సాంకేతికతతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సాంస్కృతిక విలువలను ఎన్నడూ విస్మరించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె. విశ్వేశ్వర్ రెడ్డి, జైన సమాజ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# 2 గంటలకో స్కామ్ మెసేజ్

## సందేశం, మెయిల్, సోషల్ మీడియా రూపంలో రాక లింక్ లేకుండా మెసేజ్‌లతో వల వేస్తున్న నేరగాళ్లు బాధితులను మళ్లీ లక్ష్యంగా చేసుకుంటున్న స్కామర్స్



ఆన్‌లైన్ వినియోగం విపరీతంగా పెరుగుతుండడంతో డిజిటల్ మోసాలు ఆందోళనకర స్థాయిలో అధికమవుతున్నాయి. నమ్మదగిన సందేశాలు, డీప్‌ఫేక్ వాయిస్, క్యూఆర్ కోడ్స్‌తో సైబర్ నేరగాళ్లు వల వేస్తున్నారు. తమను మోసగాళ్లు లక్ష్యంగా చేసుకున్న విషయం అత్యధికులు గ్రహించడం లేదు. నష్టం జరిగాకే తాము మోసపోయినట్టు గుర్తిస్తున్నారు. కొత్త నంబర్లు, మెసేజ్‌ల ద్వారా మొబైల్‌కు వచ్చే లింక్స్‌ను తెరవకూడదని ఆర్‌బీఐ, బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు హెచ్చరిస్తున్నా, నేరాల సంఖ్య తగ్గడం లేదు.

రోజుకు సగటున 13 మెసేజ్‌లు..: సందేశం, ఈ--మెయిల్ రూపంలో, సోషల్ మీడియా యాప్స్‌లో సగటున రోజుకు 13 మోసపూరిత (స్కామ్) మెసేజ్‌లను భారతీయులు అందుకుంటున్నారు. అంటే రెండు గంటలకో స్కామ్ సందేశం వస్తోందన్న మాట. ఆన్‌లైన్‌లో ఏది నిజమైనదో, ఏది నకిలీదో తెలుసుకోవడానికి సగటున ఒక్కో వ్యక్తి సంవత్సరానికి 102 గంటలు సమయం వెచ్చిస్తున్నారని ఆన్‌లైన్ ప్రొటెక్షన్ సేవలు అందిస్తున్న అంతర్జాతీయ దిగ్గజం మ్యాకఫీ '2026 స్టేట్ ఆఫ్ ద స్కామివర్స్'నివేదిక వెల్లడించింది. స్కామర్స్ కేవలం 30 నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయంలోనే స్కామ్ పూర్తి చేస్తున్నారని తెలిపింది. బాధితులు సగటున రూ.93,915 నష్టపోయినట్టు వెల్లడించింది.

### లింక్ లేకుండానే..

డెలివరీ నోటీసులు, సబ్‌స్క్రిప్షన్ పునరుద్ధరణ, బ్యాంక్ అలర్ట్ వంటి సందేశాలు కస్టమర్ల నమ్మకాన్ని పొందడానికి సైబర్ నేరగాళ్లు ఉపయోగించే సాధారణ వ్యూహాలుగా మారాయి. కొత్త ఎత్తుగడ ఏమంటే అనుమానాస్పద సోషల్ మీడియా సందేశాలలో 20% ఎటువంటి లింక్ లేకుండా వస్తున్నాయి. 66% మంది వినియోగదారులు ఈ లింక్ రహిత సందేశాలకు స్పందించారు. స్కామర్ల ఉచ్చులో పడడానికి ఈ అంశం కూడా కారణమైంది. రోజుకు కనీసం నాలుగు డీప్‌ఫేక్ వీడియోలు తమకు ఎదురవుతున్నట్టు వినియోగదారులు చెబుతున్నారు. డీప్‌ఫేక్ వీడియోల్లో 65% ఇన్‌స్ట్రాగామ్ వేదికగా దర్శనమిస్తున్నాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు వాయిస్--క్లోన్ స్కామ్‌ను ఎదుర్కొన్నారు. వాయిస్--క్లోన్ అంటే కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బ్యాంక్ లేదా ప్రభుత్వ అధికారుల గొంతును అనుకరిస్తూ చేసే వాయిస్ మెసేజ్ అన్నమాట.

### అధునాతన వ్యూహాలతో..

సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 70% మంది గత సంవత్సరం తమ సోషల్ మీడియా ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లాయని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను తెరవడంలో ఏడాది క్రితం కంటే ఎక్కువ జాగ్రత్తగా ఉన్నామని 82% మంది చెప్పారు. అయినా, స్కామర్లు అధునాతన వ్యూహాల ద్వారా ఇటువంటి వినియోగదారులను కూడా బోల్తా కొట్టిస్తున్నారు. నెటిజన్లను నమ్మించేందుకు సైబర్ నేరగాళ్లు ఏఐ, అధునాతన డిజిటల్ సాధనాలను ఉపయోగిస్తూ ఆర్‌బీఐ, బ్యాంకులు, ట్రాయ్, ఆధార్, ఇతర ప్రభుత్వ సంస్థల పేర్లతో సందేశాలను పంపడంతోపాటు సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతున్నారు.

### సర్వే గురించి..

**నివేదిక పేరు: మ్యాకఫీ 2026 స్టేట్ ఆఫ్ ద స్కామివర్స్**

**ఎందుకు: ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి నేరగాళ్ల వైఖరి, ప్రవర్తన, బాధితుల అనుభవాలను తెలుసుకోవడానికి**

**ఏఏ దేశాలు: భారత్, యూఎస్, ఆస్ట్రేలియా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్**

**ఎప్పుడు: 2025 నవంబర్‌లో సర్వే నిర్వహణ**

**ఎవరెవరు: 18 ఏళ్లు పైబడిన 7,592 మందిపై**

### విధానం: ఆన్‌లైన్ వేదికగా

**సర్వేలో పాల్గొన్న 87% మంది భారతీయులు తాము వ్యక్తిగతంగా ఆన్‌లైన్ స్కామ్‌ను అనుభవించామని చెబుతున్నారు.**

**సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా నష్టపోయినట్టు 51% మంది వెల్లడించారు.**

**ఒక స్కామర్ తన లక్ష్యాన్ని మోసం చేసి డబ్బు లేదా సమాచారాన్ని దొంగిలించడానికి పట్టిన సమయం కేవలం 5 నిమిషాలే.**

**ఒక సంవత్సరం క్రితం కంటే నేడు తమ వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో ఉందని 63% మంది నమ్ముతున్నారు.**

**స్కామ్ బాధితుల్లో 24% మందిని ఏడాదిలోపే సైబర్ నేరగాళ్లు మళ్లీ లక్ష్యంగా చేసుకున్నారు.**

**90% మంది మోసపూరిత క్యూఆర్ కోడ్ అందుకున్నారు. స్కాన్ చేయగానే ప్రమాదకర స్థాయికి 38% మంది చేరుకున్నారు.**

**డీప్‌ఫేక్ స్కామ్‌ను గుర్తిస్తామన్న నమ్మకం లేదని, తమను తాము రక్షించుకోలేమని మూడింట ఒక వంతుకుపైగా మంది తెలిపారు.**

# థైరాయిడ్ ఉన్నవారు బరువు తగ్గాలనుకుంటే ఈ సూచనలు పాటించడం తప్పనిసరి

థైరాయిడ్ తో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని చెప్పవచ్చు. ఒక్కసారి ఈ సమస్య బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిన పరిస్థితి నెలకొంది. మందులు వాడుతున్నప్పటికీ థైరాయిడ్ తో బాధపడే వారు కొన్ని సమస్యలను ఎదుర్కోవాల్సిందే. వాటిల్లో అధిక బరువును తగ్గించుకోవడం కూడా ఒక్కటి. థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి బరువు తగ్గడం అంత సులభమైన విషయం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా తక్కువ తినండి, ఎక్కువ కదలండి అనే ఫార్ములా అందరికీ పనిచేస్తుందని భావిస్తారు. కానీ హైపోథైరాయిడిజం ఉన్నవారిలో ఈ విధానం కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలు ఇస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్య ఉన్నవారు ఆహారం తీవ్రంగా తగ్గిస్తే, శరీరం దానిని ఒత్తిడిగా భావిస్తుంది. అప్పుడు శరీరం ఫ్యాట్‌ను కరిగించడం తగ్గించి సర్వైవల్ మోడ్ లోకి వెళుతుంది.

### హార్మోన్ల పనితీరుపై ప్రభావం..

ఈ పరిస్థితిలో శరీరంలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరుగుతాయి. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్‌ల పనితీరు మందగిస్తుంది. టి4 హార్మోన్ నుంచి టి3 హార్మోన్ గా మారే ప్రక్రియ తగ్గిపోతుంది. అదే సమయంలో రివర్స్ టి3 అనే రూపం పెరిగి, ఫ్యాట్ బర్నింగ్ ప్రక్రియను అడ్డుకుంటుంది. ఫలితంగా మెటబాలిజం తగ్గిపోవడం, అలసట పెరగడం వంటి సమస్యలు కనిపిస్తాయి. దీంతో, తక్కువ తిన్నప్పటికీ బరువు తగ్గకపోవడం, మరింత నిరుత్సాహం కలగడం జరుగుతుంది. ఇది క్రమశిక్షణ లోపం కాదు, శరీర సంకేతాల సమస్య అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంటే, శరీరం బరువు తగ్గడాన్ని అడ్డుకోవడం కాదు, అది తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తుందని నిపుణులు చెబుతున్నారు.



### సరైన పోషకాహారం తీసుకోవాలి..

ఈ సమస్యకు పరిష్కారం ఆహారం తగ్గించడం కాదు, సరైన పోషకాహారం తీసుకోవడమని కూడా వారు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా ప్రోటీన్ సరిపడా తీసుకోవడం ద్వారా మెటబాలిజం మెరుగుపడుతుంది. అలాగే మైక్రోన్యూట్రియెంట్స్ (విటమిన్లు, ఖనిజాలు) హార్మోన్‌ల పనితీరుకు సహాయపడతాయి. ఇక ఒత్తిడిని నియంత్రించడం కూడా చాలా కీలకం. నిరంతరం ఒత్తిడిలో ఉంటే శరీరం సర్వైవల్ మోడ్ లోనే కొనసాగుతుంది. అందుకే సరైన ఆహారం, విశ్రాంతి, మానసిక సమతుల్యత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా థైరాయిడ్ సమస్య ఉన్నవారు త్వరగా ఫలితాలు ఇవ్వగల క్రాష్ డైట్స్‌కి దూరంగా ఉండాలి. శరీరాన్ని పోషించడం ద్వారా మాత్రమే దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. థైరాయిడ్‌కు ఆకలి కాదు, పోషణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# ఓపెన్ ఏఐ మరో షాక్.. ఇక స్మార్ట్ ఫోన్‌లకు చెక్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తన నూతన ఆవిష్కరణలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకూ సాఫ్ట్‌వేర్ వరకే పరిమితమైందనుకుంటున్న ఓపెన్ ఏఐ ఇ?ప్పుడు హార్డ్‌వేర్ రంగంలోకీ గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. 'డైమ్' అనే కోడ్ నేమ్‌తో కంపెనీ తన మొట్టమొదటి హార్డ్‌వేర్ ఉత్పత్తిగా ఏఐ ఆధారిత ఇయర్‌బడ్స్‌ను తీసుకురానున్నట్లు 'మింట్'తన కథనంలో పేర్కొంది. 'డైమ్' ఇయర్ బడ్స్ కేవలం సంగీతం వినడానికే పరిమితం కాకుండా, వాయిస్ కమాండ్స్ ద్వారా ఏఐ మోడళ్లను నియంత్రించేలా, హ్యాండ్స్-ఫ్రీ అసిస్టెన్స్‌ను అందించేలా రూపొందించారు. ఈ ఏడాది చివరిలో వీటిని ప్రపంచానికి పరిచయం చేసి, 2027 ప్రారంభంలో మార్కెట్లోకి వీటిని విడుదల చేసే అవకాశం ఉంది. 'స్మార్ట్ పికాచు' అందించిన సమాచారం ప్రకారం చైనాలో ఇటీవల దాఖలైన ఒక పేటెంట్ ఫైలింగ్‌లో 'డైమ్' అనే పేరు వెలుగులోకి వచ్చింది. భారీ స్థాయిలో హార్డ్‌వేర్ పరికరాలను నేరుగా మార్కెట్లోకి తెచ్చే కంటే, వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ఇయర్‌బడ్స్ లాంటి సాధారణ పరికరంతో రంగప్రవేశం చేయాలని ఓపెన్ ఏఐ భావిస్తోంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక ఇబ్బందులు లేకుండా హార్డ్‌వేర్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడమే కంపెనీ వ్యూహమని తెలుస్తోంది. ఇవి వాయిస్ ఇంటరాక్షన్లపై దృష్టి సారిస్తూ, వినియోగదారులకు రియల్ టైమ్ ఏఐ సేవలను నేరుగా చెవి దగ్గరికే చేర్చనున్నాయి. గతంలో ఓపెన్ ఏఐ స్మార్ట్‌ఫోన్ తరహాలో ఉండే శక్తివంతమైన ఏఐ డివైజ్‌ను తీసుకువస్తుందనే ప్రచారం జరిగింది. అయితే హై బ్యాండ్‌విడ్త్ మెమరీ (హెచ్‌బీఎం)కొరత కారణంగా విడిభాగాల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వాయిదా పడినట్లు సమాచారం. తయారీ వ్యయం కారణంగా కంపెనీ ప్రస్తుతానికి తన నిర్ణయాన్ని మార్చుకుని, 2026లో సరళమైన వెర్షన్ (డైమ్ ఇయర్‌బడ్స్)ను లాంచ్ చేయాలని నిశ్చయించుకుందని సమాచారం. ఓపెన్ ఏఐ చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ క్రిస్ లెహనే గతంలోనే కంపెనీ తొలి హార్డ్‌వేర్ ఉత్పత్తిపై పనిచేస్తున్నట్లు ప్రకటించారు. అయితే అప్పట్లో దాని ఆకారం లేదా ఫీచర్ల గురించి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఏడాదిలోనే ఆ పరికరాన్ని ఆవిష్కరిస్తామని ఆయన పేర్కొన్నప్పటికీ, లాంచ్ తేదీని వెల్లడించలేదు. ప్రస్తుతం 'డైమ్' బ్రాండింగ్‌తో వస్తున్న ఇయర్‌బడ్స్ వార్తలపై ఓపెన్ ఏఐ ఇంకా స్పందించాల్సి ఉంది. ఆపిల్ మాజీ డిజైన్ హెడ్ జోనీ ఐవ్ నేతృత్వంలో ఈ నూతన పరికరాలు రూపుదిద్దుకుంటున్నాయనే వార్తలు టెక్ ప్రపంచంలో సంచలనంగా మారాయి. కాగా డైమ్ ఇయర్‌బడ్స్ అందుబాటులోకి వస్తే, అవి స్మార్ట్ ఫోన్ల వినియోగానికి చెక్ పెట్టనున్నాయనే వాదన వినిపిస్తోంది.

# ఏఐ పెట్టుబడుల్లో భారత్ - 8

## అగ్రస్థానాల్లో అమెరికా, సింగపూర్
## వరల్డ్ ఎకనమిక్ ఫోరం తాజా నివేదిక
## 2035 నాటికి భారత జీడీపీకి ఏఐ ఊతం
## జీడీపీలోకి రానున్న రూ.50 లక్షల కోట్లు
## పీడబ్ల్యూసీ

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాల మధ్య పోటీ వేగంగా పెరుగుతున్న వేళ.. పెట్టుబడుల పరంగా భారత్ కూడా ఈ రేసులో ముందంజలోనే ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వెల్లడించింది. 2010 నుంచి 2024 వరకు ఏఐలో అత్యధిక పెట్టుబడులు (జీడీపీలో శాతంగా లెక్కించినప్పుడు) పెట్టిన 11 దేశాల జాబితాలో భారత్‌కు 8వ స్థానం దక్కింది. మరోపక్క.. ఏఐ మనదేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి సుమారు రూ.50 లక్షల కోట్లు అదనంగా చేరే అవకాశం ఉందని అంచనా వేసింది.

దావోస్‌లో.. ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీతో కలిసి వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఓ శ్వేత పత్రం విడుదల చేసింది. దాని ప్రకారం.. 2010 నుంచి 2024 వరకు ఏఐలో పెట్టుబడుల పరంగా అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా, చైనా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో.. భారత్‌లో ఏఐ పెట్టుబడులు జీడీపీలో 1.2 నుంచి 1.8 శాతం వరకు ఉన్నాయి. అమెరికాలో ఇది రికార్డు స్థాయిలో 3.4 నుంచి 5.1 శాతం, సింగపూర్‌లో 3.1 నుంచి 4.6 శాతం వరకు ఉంది.



### అమెరికా, చైనా దూకుడు

2010--2024 మధ్య కాలంలో ఏఐ రంగంలో పెట్టుబడులు ఏడాదికి సగటున 33 శాతం చొప్పున పెరిగాయని శ్వేతపత్రం తెలిపింది. ఏఐ రంగం అత్యంత ఖరీదైనదనీ, భారీగా పెట్టుబడులు అవసరమైనప్పటికీ తక్షణ లాభాలపై స్పష్టత లేదని పేర్కొనడం విశేషం. కానీ, అమెరికా, చైనా ఈ రంగంలో భారీ పందాలు కాస్తున్నాయి. 2010 నుంచి ఇప్పటివరకు పెట్టిన మొత్తం ఏఐ పెట్టుబడుల్లో 65 శాతం ఈ రెండు దేశాలదే కావడమే అందుకు నిదర్శనం.

### మూడేళ్లలో రూ. 6 లక్షల కోట్లు

భారత్‌లో వచ్చే మూడేళ్లలో రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఏఐ పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చనున్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం అంచనా వేసింది. అలాగే ఏఐకి అవసరమైన అధునాతన చిప్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, హార్డ్‌వేర్ రంగంలో పెట్టుబడులు ఏటా 15 నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశముందని తెలిపింది.

### ఆర్థిక వ్యవస్థకూ ఊతం

భారత్ ఆర్థిక వ్యవస్థకు ఏఐ భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా అంచనా వేసింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి రూ.50 లక్షల కోట్లకుపైగా అదనంగా వచ్చి చేరే అవకాశం ఉందని వెల్లడించింది. వ్యవసాయం, విద్య, ఇంధనం, ఆరోగ్యం, తయారీ రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరిగితే ఈ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. 2050 నాటికి 160 కోట్ల జనాభాకు ఆహారం అందించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని 70 శాతం వరకు పెంచాల్సి ఉంటుందని, దీనికి డిజిటల్ సాంకేతికతలు, ముఖ్యంగా ఏఐ అవసరమని పేర్కొంది. అలాగే విద్య, వైద్య రంగాల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించనుందని వివరించింది.

**ఏఐ.. పెట్టుబడులు ఇంతింతై!**

| | దేశం | జీడీపీలో పెట్టుబడి శాతం |
|---|---|---|
| 1 | అమెరికా | 3.4 - 5.1 |
| 2 | సింగపూర్ | 3.1 - 4.6 |
| 3 | దక్షిణ కొరియా | 2.2 - 3.3 |
| 4 | చైనా | 1.7 - 2.6 |
| 5 | యూఏఈ | 1.5 - 2.3 |
| 6 | జపాన్ | 1.5 - 2.2 |
| | కెనడా | 1.5 - 2.2 |
| 7 | యూకే | 1.4 - 2 |
| 8 | భారత్ | 1.2 - 1.8 |
| 9 | యూరప్ (యూకే మినహా) | 1.1 - 1.6 |
| 10 | బ్రెజిల్ | 0.7 - 1.1 |

ఆధారం: వరల్డ్ ఎకనమిక్ ఫోరం శ్వేతపత్రం

ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ల వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటివరకు మొత్తంగా రూ.55 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'భారీ డేటా సెంటర్ల' సంఖ్య 1,136 కాగా 2030 నాటికి ఇది 2,000 దాటొచ్చని అంచనా.

## "పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే తక్కువ"



న్యూఢిల్లీ: ఆశ్రమ పాఠశాలల్లో మృతి చెందిన ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పరిహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. ఆ పరహారం కొంతమంది రాజకీయ నాయకులు ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ??బు కంటే కూడా తక్కువగా ఉందని చెప్పారు. ఎక్స్‌లో దీప్కే స్పందిస్తూ.. 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. "కేవలం 2 సంవత్సరాల్లో మహారాష్ట్రలోని ఆశ్రమ పాఠశాలల్లో 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థులు మృతి చెందారు. వారి కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే అందింది" అని దీప్కే పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రతను ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, నిర్లక్ష్యం కారణంగానే వారు మృతి చెందారని దీప్కే ఆరోపించారు. "వారి భద్రత, సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్ధారించడంలో విఫలమైంది. నిర్లక్ష్యం, శ్రద్ధ లేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా విద్యార్థులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే మొత్తం కంటే ఇది తక్కువే కావచ్చు. రాష్ట్రం దృష్టిలో ఆదివాసీ విద్యార్థి జీవితం విలువ ఇంతేనా?" అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ ట్రైబ్ అభ్యర్థులను నియమించాలని, గిరిజన పిల్లల కోసం నిర్వహిస్తున్న వసతి పాఠశాలల పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థులు నిరసనలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు. గడ్చిరోలి జిల్లాలోని ఒక వసతి పాఠశాలలో పాముకాటుకు గురై ముగ్గురు గిరిజన బాలికలు మృతి చెందిన ఘటన తర్వాత పుణె, నాగ్‌పూర్, నాసిక్‌లలో నిరసనలు ప్రారంభమయ్యాయి. గిరిజన వసతి గృహాల్లో ఉంటూ, గిరిజన వసతి పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.10 కోట్ల బీమా కవరేజీ కల్పించాలని కూడా నిరసనకారులు డిమాండ్ చేశారు.

## తీవ్ర విషాదం.. కల్తీ మద్యం సేవించి 10 మంది మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పదిమంది మృతిచెందారు. మృతులంతా అక్కడి ఘూఘర్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు చెందినవారిగా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అయితే నిన్న శనివారం మద్యం సేవించిన అనంతరం బాధితుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో వారు మృతిచెందిట్లు వైద్యులు ప్రకటించారు. మరి కొంతమందికి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ మరణాలకు కల్తీ మద్యమే కారణమై ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నప్పటికీ, పోస్టుమార్టం నివేదికలు వచ్చే వరకు అధికారికంగా కారణాన్ని నిర్ధారించలేదు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### యూపీ నుంచి కల్తీ మద్యం సరఫరా?

ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సాగర్‌కు సరిహద్దుగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్ కేంద్రంగా ఓ అక్రమ మద్యం సరఫరా నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.నిందితులు లలిత్‌పూర్‌లో నకిలీ మద్యాన్ని తయారు చేసి, సాగర్ సరిహద్దు గ్రామాలకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. నకిలీ మద్యాన్ని అసలైన బ్రాండ్ల మాదిరిగా కనిపించేలా నకిలీ లేబుళ్లు, క్యాప్‌లు, క్యూఆర్ కోడ్‌లు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. కార్లు, మోటార్‌సైకిళ్ల ద్వారా ఈ మద్యాన్ని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు అనుమానిస్తున్నారు.బాంద్రీ, బరోడియా, ఘూఘూరా ఖుర్ద్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు ఈ నకిలీ మద్యం చేరినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరు సరఫరా చేశారు? స్థానికంగా ఎవరైనా ఈ అక్రమ నెట్‌వర్క్‌కు సహకరించారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

### ఘటనపై సీఎం సీరియస్

సాగర్‌లో జరిగిన మరణాలపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. ఘటనాస్థలికి సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఏపీకి బిగ్ అలర్ట్.. రాగల మూడు గంటల్లో..



విజయవాడ: రాగల మూడు గంటల్లో వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నూజివీడు, ఆగిరిపల్లి, గన్నవరం, ఏలూరు, మైలవరం, నున్న, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కాగా, దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. పలు రాష్ట్రాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ.. ఢిల్లీతో పాటు హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, బిహార్, నాగాలాండ్, మణిపూర్, మిజోరంలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

## 'అక్రమాలపై ప్రశ్నిస్తే చంద్రబాబుకు ఎందుకంత భయం?'




తాడేపల్లి: అక్రమాలను ప్రశ్నిస్తుంటే చంద్రబాబు సర్కార్‌కు భయం పట్టుకుందని.. అందుకే ప్రశ్నించే గొంతులను నులుముతున్నారంటూ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అనధికార సెన్సార్ షిప్ దుర్మార్గం అన్నారు. సోషల్ మీడియా ఖాతాలను లేపేస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను తొలగించారు. సాక్షి టీవీ, బిగ్ టీవీ ఖాతాలను కూడా లేపేశారు. ప్రశ్నించే గొంతులను చూసి చంద్రబాబుకు ఎందుకంత భయం?" అంటూ శివశంకర్ ప్రశ్నించారు. డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నిస్తే నేరమా?. అందులో అబద్దాలు ఉంటే ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కానీ సోషల్ మీడియా, టీవీ ఛానళ్ల ఎక్కౌంట్లపై దాడి ఎందుకు?. తప్పులను కప్పి పుచ్చుకోవటానికే సోషల్ మీడియా ఖాతాలపై దాడి చేస్తున్నారు. ఇదే కొనసాగితే సోషల్ మీడియా వార్ తప్పదు. డీఎస్సీలో అక్రమాలకు మంత్రి లోకేష్ బాధ్యత వహించాలి. పదవికి రాజీనామా చేసి సీబీఐతో విచారణ జరపాలి. సోషల్ మీడియా అకౌంట్లపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నాం. న్యాయ పోరాటం చేసి మళ్ళీ ఆ అక్కౌంట్లను సాధిస్తాం" అని శివశంకర్ అన్నారు.

# ప్రపంచం మారిపోయింది!

### సరికొత్త ఈక్వల్ ఎర్త్ మ్యాప్ సిద్ధం
### ఐక్యరాజ్యసమితి ఆమోదం
### అమెరికా వ్యతిరేకం, భారత్ మద్దతు




అవును. మీరు చదివింది అక్షరాలా నిజం. ఎప్పుడో జీపీఎస్, లైడార్ వంటి టెక్నాలజీలేవీ లేని కాలంలో ఫ్రెంచ్ కార్టోగ్రాఫర్ మెర్కాటర్ తయారు చేసిన మ్యాప్ స్థానంలో ఐక్యరాజ్యసమితి సరికొత్త ప్రపంచ పటాన్ని అధికారికంగా ఆమోదించింది. పాత మ్యాప్‌లో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియాలు వాటి వాస్తవ సైజు కంటే తక్కువగా కనిపిస్తున్నాయని, దాన్ని సరిచేస్తూ 'ఈక్వల్ ఎర్త్'పేరుతో కొత్త మ్యాప్ తయారు చేశామని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. భారత్ సహా మొత్తం 164 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు తెలపగా అగ్రరాజ్యం అమెరికా వ్యతిరేకించింది. ఆరు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. విద్య, మీడియా, అంతర్జాతీయ విధానాల్లో దేశాలకు తగిన ప్రాధా న్యం లభించాలన్నది ఈ మార్పు ఉద్దేశం. ఒకసారి ప్రపంచపటాన్ని చూడండి. ఎగువభాగంలో గ్రీన్‌ల్యాండ్.. దిగువన ఆఫ్రికా ఖండం కనిపిస్తాయి. రెండింటిలో ఏది పెద్దదంటే మీరేమంటారు? సహజంగానే గ్రీన్‌ల్యాండ్ అని సమాధానం వస్తుంది. కానీ.. దీంతోపోలిస్తే ఆఫ్రికా ఒకటి కాదు..రెండు కాదు.. 14 రెట్లు ఎక్కువ సైజుంటుంది. మెర్కాటర్ అనే మ్యాపుల తయారీదారు 1569లో సిద్ధం చేసిన మ్యాప్‌నే మనం ఇప్పటికీ వాడుతూండటం దీనికి కారణం. ఇదొక్కటే కాదు.. ఇలాంటి తేడాలు ఇంకా చాలానే ఉన్నాయి దీంట్లో. ప్రపంచాన్ని కాగితంపై చూపించడానికి చేసుకున్న ఎన్నో రాజీల్లో మెర్కాటర్ మ్యాప్ ఒకటి. భూమి గుండ్రంగా త్రీడీలో ఉంటే.. కాగితం 2డీలో ఉండటం అసలు సమస్యకు కారణం. దీన్ని సరిచేసేందుకు మ్యాప్ ప్రొజెక్షన్ పద్ధతిని ఉపయోగించారు. ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాత మెర్కాటర్ ప్రొజెక్షన్‌లో తేడాలు వచ్చేశాయి. భూమధ్య రేఖకు దూరంగా జరుగుతున్న కొద్దీ మ్యాప్‌లోని భూభాగాల పరిమాణం పెరిగిపోతూ ఉంటుంది. అయితే అప్పట్లో మెర్కాటర్ ఈ మ్యాపును కేవలం సముద్రయానం కోసం మాత్రమే తయారు చేశాడు. అందుకే ఆఫ్రికా విస్తీర్ణం 303.7 కోట్ల చదరపు కిలోమీటర్లయినా.. మెర్కాటర్ మ్యాప్‌లో 21.7 కోట్ల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మాత్రమే ఉన్న గ్రీన్‌ల్యాండ్ కంటే చిన్నగా కనిపిస్తూంటుంది. అప్పట్లో సముద్రయానానికి మెర్కాటర్ మ్యాప్ బాగా పనిచేసింది కానీ.. ఈ తేడాలు అనేక ఇతర సమస్యలను తీసుకొచ్చాయి. ఈక్వల్ ఎర్త్ మ్యాప్ అవసరం ఏర్పడింది ఇందుకే. బోజన్ సావ్రిచ్, టామ్ ప్యాటర్సన్, బెర్న్‌హార్డ్ జెన్నీ అనే ముగ్గురు కార్టోగ్రాఫర్‌లు 2018లో 'ఈక్వల్ ఎర్త్'మ్యాప్‌ను రూపొందించారు. భూభాగాల విస్తీర్ణాన్ని సరిగ్గా చూపించడం ఈ ప్రొజెక్షన్ ముఖ్య ఉద్దేశం. అంతేకాదు...లెక్కల్లో గట్టిగా ఉండటమే కాకుండా.. చూసేందుకు కూడా సహజంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వాస్తవానికి ప్రపంచ పటం విషయంలో కొన్ని వందల ప్రొజెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ వీటిల్లో మెర్కాటర్ సహా ఓ డజను మాత్రమే ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్‌లో భూభాగాల పరిమాణాలు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండటం వల్ల ఎవరో పెద్ద... మిగిలిన వారు చిన్న అన్న భావన భావన ఏర్పడే అవకాశం ఉండదని మద్దతుదారుల అంచనా.

### ఆఫ్రికా దేశాల ఉద్యమం

ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ మ్యాప్ ముఖ్యంగా ఆఫ్రికా దేశాల ఉద్యమం ఫలితంగానే సాకారమైందని చెప్పాలి. ఆఫ్రికన్ దేశం టోగో కొత్త మ్యాప్ ప్రతిపాదన చేయగా ఆఫ్రికన్ యూనియన్ మద్దతు ఇచ్చింది. ఆఫ్రికా పరిమాణాన్ని సరిగ్గా చూపడమే కాకుండా... పాత అసమానతలను సరి చేయాలన్నది ఆఫ్రికా దేశాల ఉద్దేశం. ఇందుకు తగ్గట్టుగానే ఐరాస తీర్మానం కూడా పాఠశాలల్లో, పాఠ్యపుస్తకాల్లో మీడియా, సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఈక్వల్ ఎర్త్ వంటి ప్రొజెక్షన్ల వినియోగాన్ని పెంచమని కోరుతోంది.

# 'మిద్దె'కు మద్దతిస్తే..'అర్బన్'కు ఆరోగ్యమే!

### కాంక్రీట్ నగరాలు 'ఎడిబుల్ సిటీస్'గా మారితేనే ఆహార సుస్థిరత
### అర్బన్ అగ్రికల్చర్‌ను మున్సిపల్ ప్రణాళికల్లో చేర్చాలంటున్న నిపుణులు
### ప్రోత్సాహక విధానాల్లేవు...లోతైన అధ్యయనాలు అవసరం
### పర్యావరణ అనుకూల నగరంగా ప్రభుత్వం మార్చాలి
### తోటలు పెంచే ఇళ్లకు ఆస్తి పన్నులో రాయితీలు ఇవ్వాలి



నగరాల్లో మిద్దెతోటలు, ఇంటిపంటల సాగు పెరుగుతున్నా, అది కేవలం గృహస్తుల హాబీగానే మిగిలిపోతోంది. వాతావరుణ మార్పుల నేపథ్యంలో అర్బన్ అగ్రికల్చర్‌ను మునిసిపల్ మాస్టర్ ప్లాన్లులో చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుయ్యే మొత్తం ఆహారంలో సుమారు 70 శాతం నగరాల్లోనే వినియోగమవుతోందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ) చెబుతోంది. విధానపరమైన చర్యల ద్వారా నగరాలను 'ఎడిబుల్ సిటీ'లుగా అంటే.. పర్యావరణ అనుకూల, సుస్థిర ఆహారోత్పత్తి కేంద్రాలుగా మార్చువచ్చని నిపుణులు సూచిస్తున్నారు. భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన అధ్యయనం మిద్దె తోటలపై ఆసక్తిని తెలియజెప్తోంది. 70% మంది గృహస్తులు మిద్దె తోటలపై ఆసక్తి చూపుతున్నా, 35% మాత్రమే ప్రస్తుతం పండిస్తున్నారు. 56% ప్రభుత్వ/విద్యా సంస్థల్లో ఖాళీ స్థలాలు, 67% సంస్థల్లో అనువైన టెర్రస్‌లు ఖాళీ స్థలాలున్నాయి. అయితే, అర్బన్ అగ్రికల్చర్ ప్రోత్సాహక విధానాల్లేవు. భువనేశ్వర్ మాదిరిగా ఇక్కడ కూడా లోతైన అధ్యయనాలు చేసి తగిన విధానాలు అమల్లోకి తేవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఏం చెయ్యాలి?

అర్బన్ అగ్రికల్చర్ విస్తరణకు స్థల కొరత, నీటి కొరత పెద్ద అవరోధాలు. వీటిని అధిగమించటానికి నిపుణులు కింది ఆచరణాత్మక పరిష్కారాలను సూచిస్తున్నారు.

వాణిజ్య భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలలో రూఫ్‌టాప్ లేదా వర్టికల్ గార్డెనింగ్‌కు స్థలాన్ని తప్పనిసరి చేయటం.

ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో మురుగునీటి శుద్ధి వ్యవస్థలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను స్థానిక మిద్దె తోటలు, ఇంటిపంటల సాగుకు అనుసంధానించటం.

తడి చెత్తతో కంపోస్టింగ్ చేసి నాణ్యమైన సేంద్రియ ఎరువులను పంపిణీ చేయటం.

తోటలు పెంచే ఇళ్లకు ఆస్తి పన్నులో 5--10% రాయితీ, బిందు సేద్యం కిట్లపై సబ్సిడీలు అందించటం.

ప్రజా స్థలాలు, భవనాల్లో ఆహారోత్పత్తిని పట్టణ ప్రణాళికలో భాగం చేసి స్థానిక మార్కెట్లతో అనుసంధానించటం.

### 'ఎడిబుల్ సిటీ'లకు విధానాల మద్దతు

వాతావరణ మార్పుల నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో కుటుంబాలకు తాజా, పోషక ఆహారాన్ని అందించడంలో అర్బన్ అగ్రికల్చర్ కీలక పాత్ర పోషిస్తుంది. పెరటి, మిద్దె, బాల్కనీ తోటలను విస్తరించటానికి అనుకూలమైన ప్రభుత్వ విధానాల మద్దతు అవసరం. వ్యవసాయ, పట్టణాభివృద్ధి, పర్యావరణ శాఖల సమన్వయంతో 'ఎడిబుల్ సిటీల'ను అభివృద్ధి చేసి, పర్యావరణ అనుకూల నగరాలను తీర్చిదిద్దడం అత్యవసర వ్యూహం.

### నగర ప్రణాళికలో భాగం చేయాలి

వాతావరణ మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ వల్ల ఆహార పంపిణీ వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతున్నందున మిద్దె తోటలు వంటి అర్బన్ అగ్రికల్చర్ పద్ధతులను నగర ప్రణాళికలో భాగం చేయాలి. 'కోకోపోనిక్స్'వంటి మట్టిలేని ఆధునిక సాగు పద్ధతులు స్థల కొరత, నీటి కొరతను అధిగమించి స్థానిక ఆహార భద్రతను పెంచుతాయి.అందువల్ల రాష్ట్ర విధానాలు పట్టణ వ్యవసాయాన్ని, వ్యర్థాల పునర్వినియోగాన్ని ప్రోత్సహించి నగరాలను పర్యావరణ అనుకూలంగా తీర్చిదిద్దాలి.

### మిద్దెతోటల్లో ఎల్‌నినో జాగ్రత్తలు

ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల్లో మిద్దె తోటల్లో నీటిని ఆదా చేయడం ముఖ్యం. కుండీల్లో ఎండుటాకులు లేదా కొబ్బరి పొట్టుతో మల్చింగ్ చేసి, తేమ ఆవిరవకుండా చూడాలి. ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే అవసరమైనంత నీరు పోయాలి. బాల్కనీల్లో బాటిల్ డ్రిప్ వాడడం, ఎండ తీవ్రతను తగ్గించేందుకు 50% గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు చేయటం వల్ల తక్కువ నీటితో కూరగాయలు, పండ్ల మొక్కలను రక్షించుకోవచ్చు.

# ఆట.. మీ జీన్స్‌లో ఉందా?

### డీఎన్ఏతో చాంపియన్ల తయారీ..
### 2030లో అహ్మదాబాద్‌లో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో పతకాల సాధనకు గుజరాత్ కొత్త ప్రయోగం
### క్రీడాకారుల ప్రతిభను వారి జన్యు, శారీరక, ప్రతిభా సమాచారంతో గుర్తించి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ




ఒక చిన్న డీఎన్ఏ నమూనా.. దేశంలో ఒక పెద్ద క్రీడా భవిష్యత్తుకు క్లూ కానుంది! మన క్రీడాకారులు మైదానంలో చెమట చిందించక ముందే.. వారి జన్యువులను ల్యాబ్‌లో విశ్లేషించి ఎవరు భవిష్యత్ చాంపియన్లు కాగలరో గుర్తించే ప్రయత్నం మొదలైంది! ఎవరు ఏ క్రీడలో రాణించగలరు? ఎవరి శరీరం ఏ ఆటకు అనువుగా ఉంటుంది? ఎవరిలో ఎంత శక్తి దాగుంది? అనే ప్రశ్నలకు సమాధానాలను డీఎన్ఏలో వెతికే సరికొత్త ప్రయోగానికి గుజరాత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అహ్మదాబాద్ వేదికగా 2030లో జరగే కామన్వెల్త్ క్రీడల్లో చాంపియన్లుగా నిలిచే సత్తా ఉన్న వారెవరో వెలికితీసేందుకు దేశంలోనే తొలిసారిగా గుజరాత్ ప్రభుత్వం క్రీడా జీనోమిక్స్ కార్యక్రమాన్ని చేపట్టింది. క్రీడాకాురుల జన్యు సమాచారాన్ని వారి శారీరక, క్రీడా ప్రదర్శన వివరాలతో అనుసంధానించి సమగ్ర ప్రొఫైళ్లను రూపొందించనుంది. వాటి ఆధారంగా క్రీడా ప్రతిభను గుర్తించడంతోపాటు అందుకు అనువైన క్రీడాశిక్షణను రూపొందించడం, క్రీడాకారులకు అనువైన క్రీడను ఎంపిక చేయడం, గాయాల నిర్వహణ వంటి అంశాలను మరింత మెరుగ్గా చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని గుజరాత్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ అమలు చేస్తోంది. ఇందుకోసం గుజరాత్ అథ్లెట్ జీనోమ్ డేటాబేస్‌ను రూపొందించనుంది. ఇందులో క్రీడాకారుల జన్యు, శారీరక, క్రీడా ప్రదర్శనకు సంబంధించిన సమాచారాన్ని సమీకరిస్తారు. "క్రీడా ప్రతిభను గుర్తించి, క్రీడాకారులను అభివృద్ధి చేసేందుకు మరింత శాస్త్రీయ, ఆధారిత విధానాన్ని రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం" అని గుజరాత్ శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి అర్జున్ మోఢ్వాడియా తెలిపారు.

ఈ ఏడాది 2,000 డీఎన్ఏ నమూనాలు

మొదటి దశలో టెన్నిస్ క్రీడాకాురుల నుంచి డీఎన్ఏ నమూనాులను సేకరించనున్నారు. తదుపరి దశలో ఆర్చరీ, ఫెన్సింగ్, జూడో, షూటింగ్ క్రీడాకారులను చేర్చనున్నారు. ఈ ఏడాది సుమారు 2,000 నమూనాలు, వచ్చే ఏడాది 10,000 నమూునాలు సేకరించి విశ్లేషించాలని గుజరాత్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 14 ఏళ్లలోపు, 14 నుంచి 18 ఏళ్లలోపు, 18 ఏళ్లు పైబడిన క్రీడాకారుల కోసం మూడ్వేురు విభాగాలతో డేటాబేస్ రూుపొందించనున్నారు. రాష్ట్ర, జాతీుయ స్థాయి చాంపియన్లకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనుున్నాురు. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, బాుక్సియిగ్, రెజ్లింగ్, జూడో, టెన్నిస్, తైక్వాండో, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌ుబాుల్, వాలీబాల్, బాుస్కెట్‌ుబాల్, బ్యాడ్మింటన్, టేబుుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, షూటింగ్, చెస్ తదితర క్రీడలకు సంబంధించిన సమాచాురాున్ని డేటాబేస్‌లో చేర్చనున్నారు.

గాయాలు, శిక్షణపై కూడా ఉపయోగం

జన్యు లక్షణాలు కండరాల నిర్మాణం, ఓర్పు, జీవక్రియ, వ్యాయాుమానికి శరీరం స్పందించే తీరు, కోలుకునే వేగం, గాయాలకు గురయ్యే అవకాశాలు వంటి అంశాలతో ఏ మేరకు సంబంధం కలిగి ఉన్నాయో తెలుసుకునేందుకు స్పోర్ట్స్ జీనోమిక్స్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. "జన్యు, జీవసంబంధ సమాచారాన్ని సమీకరించడం ద్వారా ప్రతి క్రీడాకారుడికి మరింత సమగ్ర ప్రొఫైల్‌ను రూపొందించడమే గుజరాత్ నమూనా లక్ష్యం. తద్వారా క్రీడాకారుల ప్రతిభపై మరింత లోతైన అవగాహన లభిస్తుంది" అని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి బి. భారతి తెలిపారు.

## భారత్ పాకిస్థాన్ మ్యాచ్
# లైవ్ ఎక్కడ చూడాలో తెలుసా?

మహిళల ఆసియా కప్ 2026 : టోర్నీలో హై వోల్టేజ్ మ్యాచ్ కు అంతా సిద్ధం- అరుదైన రికార్డు కొట్టనున్న భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్




ఢిల్లి : 2026 ఆసియా కప్ లో భారత మహిళల జట్టు అసలైన మ్యాచ్ కు రెడీ అయ్యింది. ఇప్పటికే రెండు వరుస విజయాలతో సెమీఫైనల్ కు చేరిన టీమ్ఇండియాకు ఇది నామమాత్రపు మ్యాచే. కానీ, ప్రత్యర్థి పాకిస్థాన్ అవ్వడంతో మ్యాచ్ పై సర్వత్రా ఉత్కంఠ. గత మ్యాచ్ ల ఫామ్ ను కొనసాగిస్తూ హర్మన్ సేన ఇందులోనూ రెచ్చిపోయి దాయాదిని మరోసారి చిత్తుగా ఓడించాలని టీమ్ఇండియా అభిమానులు భావిస్తున్నారు. మరి ఈ మ్యాచ్ గురించి మరిన్ని విషయాలపై ఓ లుక్కేద్దాం! పొరపాట్లు సరిచేసుకోవాలి! తొలి రెండు మ్యాచ్ ల్లో భారీ విజయాలు సాధించిన భారత్ జట్టులోనూ లోపాలు ఉన్నాయి. బ్యాటింగ్ లో ఒకరిద్దరు తప్పిదే మిగిలిన ప్లేయర్ల నుంచి సహకారం కరవైంది. ముఖ్యంగా భారీ అంచనాలు ఉన్న కెప్టెన్ హర్మన్ ప్రీత్, ప్రతీకా రావల్, రిఛా ఘోష్ వరుసగా రెండు మ్యాచ్ ల్లోనూ విఫలమయ్యారు. వీళ్లు ముగ్గురు పెద్దగా చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. దీంతో సెమీస్ కు ముందు ఈ మ్యాచ్ తోనైనా ఫామ్ లోకి రావాల్సి ఉంది.

### ఓపెనర్లే బలం!

టీమ్ఇండియాకు ఓపెనర్లే బలం అనడంలో సందేహం లేదు. ఎందుకంటే, తొలి మ్యాచ్‌లో షఫాలీ వర్మ థాయ్ లాండ్ పై 64 పరుగులు చేసి రాణించింది. ఇక రెండో మ్యాచ్‌లో హాంగ్ కాంగ్ పై స్మృతి మంధాన ఏకంగా సెంచరీతో మెరిసింది. ఈ రెండు మ్యాచ్ ల్లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకుంది వీళ్లిద్దరే. దీంతో పాకిస్థాన్ పైనా మంచి ఆరంభం ఇస్తే, జట్టుకు భారీ స్కోర్ రావడం ఖాయం. తిరుగులేని బౌలింగ్ బౌలింగ్ లో భారత స్పిన్న్ త్రయం శ్రీ చరణి, దీప్తి శర్మ, ప్రేమ రావత్ అదరగొట్టేస్తున్నారు. ప్రత్యర్థి బ్యాటర్లకు పరుగులు ఇవ్వకుండా కట్టడిచేస్తూ, వికెట్లు తీయడంలో సఫలం అవుతున్నారు. ఈ త్రయాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్ ప్లేయర్లుకు సవాల్ అని చెప్పవచ్చు. ఇక పేసర్లు నందని శర్మ, క్రాంతి గౌడ్ కూడా నిలకడగా ఆడుతున్నారు రాణిస్తున్నారు. మరోసారి జట్టు సమష్టి ప్రదర్శన చేస్తే గ్రూప్ దశను ఓటమి లేకుండా ముగించడం భారత్ కు పెద్ద కష్టమేమీ కాదు.

### పాక్ కు ఛాన్సుందా?

ఈ టోర్నీలో ఇప్పటిదాకా పాక్ ఒకే మ్యాచ్ ఆడింది. థాయ్ లాండ్ తో ఆడిన ఆ జట్టు విజయం సాధించింది. ఇప్పుడు భారత్ ను ఢీ కొడుతోంది. ఇందులో నెగ్గి సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలని భావిస్తోంది. కానీ పాక్ కంటే అన్ని విధాలుగా బలంగా ఉన్న టీమ్ఇండియాను ఓడించడం వాళ్లకు పెద్ద సవాలే. అయినా కెప్టెన్ ఫాతిమా సనాపై పాక్ బోలెడు ఆశలు పెట్టుకుంది. ఆమె బంతితో, బ్యాటుతో సత్తా చాటగలదు. ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్ మునీబా అలీ కూడా నాణ్యమైన బ్యాటరే. వీళ్లతోపాటు నష్రా సంధు, సాదియా ఇక్బాల్, హనితో బౌలింగ్ కూడా బలంగానే కనిపిస్తుంది. దీంతో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగడం పక్కా అనిపిస్తోంది. లైవ్ ఎక్కడంటే? ఈ టోర్నమెంట్ కు సోనీ స్పోర్ట్స్ నెట్ వర్క్ అధికారిక బ్రాడ్ కాస్టర్ గా వ్యవహరిస్తుంది. దీంతో ఈ హైవోల్టేజ్ మ్యాచ్ ను సోనీ స్పోర్ట్స్ నెట్ వర్క్ లో లైవ్ చూడవచ్చు. సోనీ స్పోర్ట్ టెన్ 1, సోనీ స్పోర్ట్ టెన్ 3, సోనీ స్పోర్ట్ టెన్ 4 బ్రాడ్ కాస్టింగ్ ఛానెళ్లలో లైవ్ అందుబాటులో ఉంటుంది. అలాగే సోనీ లివ్ యాప్ లేదా వెబ్ సైట్ లో లైవ్ స్ట్రీమింగ్ కూడా చూడవచ్చు.

### మ్యాచ్ డీటెయిల్స్

దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిథ్యం ఇవ్వనుంది. శనివారం రాత్రి 8 గంటలకు ఆట ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.

### హర్మన్ రికార్డ్

హర్మన్‌ప్రీత్ టీ20ల్లో భారత్ కు కెప్టెన్ గా వ్యవహరిస్తున్న 150వ మ్యాచ్ ఇది. ఇప్పటిదాకా మహిళలతో పాటు పురుషుల క్రికెట్లోనూ ఇన్ని టీ20ల్లో జట్టుకు కెప్టెన్సీ వహించలేదు.

## 'వైభవ్ కోసమే నా భార్య దులీప్ ట్రోఫీ చూస్తోంది'
# చిన్నోడిపై మాజీ క్రికెటర్ ప్రశంసలు

సూర్యవంశీపై కురుస్తున్న ప్రశంసల వర్షం

తాజాగా ఈ చిచ్చరపిడుగును మెచ్చుకున్న కృష్ణమాచారి శ్రీకాంత్



ఢిల్లి : క్రికెట్ లో ఎంట్రీ ఇచ్చిన తర్వాత వైభవ్ సూర్యవంశీ ఏ టోర్నీలో ఆడినా సంచలనాలు సృష్టిస్తూనే ఉన్నాడు. ఐపీఎల్, డొమెస్టిక్, అంతర్జాతీయ క్రికెట్‌లో 15ఏళ్లకే తన ముద్ర వేస్తూ రికార్డులు బ్రేక్ చేస్తున్నాడు. ఇప్పుడు దేశవాళీ టెస్టు ఫార్మాట్ దులీప్ ట్రోఫీలోనూ ఈ చిచ్చరపిడుగు ఆకట్టుకుంటున్నాడు. ఈ క్రమంలోనే వైభవ్ తన కెరీర్ లోనే అత్యుత్తమ ప్రశంస అందుకున్నాడు. భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించాడు. తన సతీమణి వైభవ్ కోసమే దులీప్ ట్రోఫీ చూస్తున్నారని అన్నాడు. ఇప్పుడిప్పుడే కెరీర్ ప్రారంభించిన అతడికి ఇలాంటి ప్రశంస దక్కడం తన ప్రతిభకు నిదర్శనం అని చెప్పవచ్చు.

### వైభవ్ కోసమే నా భార్య దులీప్ ట్రోఫీ చూస్తోంది : క్రిష్

"వైభవ్ అద్భుతంగా ఆడుతున్నాడు. అందుకే అతడిని నిరుత్సాహపరచకూడదు. ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉండాలి. సరైన రీతిలో తీర్చిదిద్దితే, అతడు భవిష్యత్తులో ఒక సూపర్ స్టార్ అవుతాడు. టెస్ట్ క్రికెట్‌కు పూర్వ వైభవాన్ని అతను తిరిగి తెస్తాడు. అతని వల్లే అందరూ దులీప్ ట్రోఫీని చూశారు. చివరికి నా భార్య కూడా అతని కోసమే ఈ మ్యాచ్ లు చూస్తోంది. భవిష్యత్తులో ప్రపంచ క్రికెట్‌కు అతను ఒక గొప్ప ఆటగాడిగానిలుస్తాడు" అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

### ప్రపంచ క్రికెట్ ను ఏలేస్తాడు

'ఈ కుర్రాడు ఉన్నత స్థాయి క్రికెట్ ఆడగలడా? లేదా అని ఎవరైనా ఇంకా ఎలా సందేహించగలరు? అతను ఏ స్థాయి క్రికెట్ అయినా ఆడగలడు. త్వరలోనే అన్ని ఫార్మాట్లలోనూ ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తాడు. ఏమాత్రం భయం లేకుండా రెడ్ బాల్ క్రికెట్‌లో మీడియం పేసర్లను ఎదుర్కొంటున్నాడు. వాళ్ల బౌలింగ్ లో స్ట్రెయిట్ సిక్సర్లు కొడుతూ విరుచుకుపడుతున్నాడు' అని క్రిష్ అన్నాడు. కాగా, ఈ టోర్నీలో వైభవ్ ఈస్ట్ జోన్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆ జట్టుకు అతడు వైస్ కెప్టెన్ కూడా. రీసెంట్ గా నార్త్ జోన్ తో జరిగిన మ్యాచ్‌లో విఫలమైనా (8 పరుగులు), సెమీ ఫైనల్ లో ఆకట్టుకున్నాడు. సెంట్రల్ జోన్ తో జరిగిన ఈ మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్ లో 92 పరుగులు, రెండో ఇన్నింగ్స్ లో 40 రన్స్ తో చేసి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. ఇక ఈ టోర్నీలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ టైటిల్ ఫైట్ లో ఈస్ట్ జోన్ తో సౌత్ జోన్ జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 06న ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది.

### 15ఏళ్లకే కెప్టెన్ గానూ

అయితే 15ఏళ్లకే ఇంటర్నేషనల్ డెబ్యూ చేసిన వైభవ్, అదే వయసులోనే దులీప్ ట్రోఫీ జట్టుకు కెప్టెన్ గానూ బాధ్యతలు వహించాడు. ప్రస్తుత టోర్నీ సెమీస్ లో సెంట్రల్ జోన్ తో మ్యాచ్ సమయంలో తమ జట్టు రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ కు గాయమైంది. దీంతో అతడు కాసేపు మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఈస్ట్ జోన్ కు వైభవే కెప్టెన్ గా వ్యవహరించాడు.

## భారత క్రికెట్ చరిత్రలోనే మొట్టమొదటిసారి
# జపాన్ తో టీమ్ఇండియా మ్యాచ్ కు డేట్ ఫిక్స్

ఆసియా క్రీడల కోసం ఈ నెలలోనే జపాన్‌కు వెళ్లనున్న భారత పురుషుల క్రికెట్ జట్టు - అంతకుముందు జపాన్‌తో ఒక చరిత్రాత్మక మ్యాచ్



: భారత్ క్రికెట్ లో అపూర్వ ఘట్టం ఆవిష్కృతం కానుంది. క్రికెట్ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా టీమ్ఇండియా జట్టు జపాన్ తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడనుంది. భారత్– జపాన్ మధ్య 75ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా పురుషుల జట్ల మధ్య ఈ క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు బీసీసీఐతోపాటు జపాన్ క్రికెట్ అసోసియేషన్ అధికారికంగా వెల్లడించాయి. దీంతో ఈ మ్యాచ్ ఇరుదేశాల క్రికెట్ లో చరిత్రాత్మక ఘట్టంగా నిలువనుంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ మ్యాచ్‌ను భారత క్రికెట్‌కు ఒక గొప్ప అవకాశంగా అభివర్ణించారు. జపాన్ ప్రేక్షకుల ప్రేమను అందుకునేందుకు ఈ మ్యాచ్ మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. భారత్ – జపాన్ మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహపూర్వక సంబంధాలను ప్రస్తావించిన సైకియా, దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల్లో క్రికెట్ భాగస్వామ్యం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉందని అన్నారు. క్రికెట్‌ను హద్దులు దాటి విస్తరించాల్సిన బాధ్యత తమపై ఉందని బీసీసీఐ గుర్తిస్తోందని, క్రీడను బలోపేతం చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తామని కూడా సైకియా తెలిపారు. ఈ మ్యాచ్ పట్ల జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జజుూ) నవోకి మియాజీ హర్షం వ్యక్తం చేశారు. భారత జట్టును జపాన్‌కు ఆహ్వానించడం తమ బోర్డుకు ఒక చరిత్రాత్మక ఘట్టమని నవోకి మియాజీ పేర్కొన్నారు. ఇందుకోసం సహకారం అందించిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలియజేశారు. భారత క్రికెట్ అభిమానులు జపాన్‌కు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, స్థానిక జపనీస్ ప్రజలు మ్యాచ్‌ను వీక్షించి, తమ జట్టుకు మద్దతు తెలపాలని ఆయన కోరారు. భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం జపనీస్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో తమ సామర్థ్యాన్ని పరీక్షించుకునే గొప్ప అవకాశంగా నిలుస్తుంది. కాగా, 'సుజుకి కప్' పేరుతో ఈ మ్యాచ్ ను నిర్వహించనున్నారు. ఇది 2026 సెప్టెంబర్ 22న తోచిగి ప్రాంతంలోని 'సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్'లో జరుగునుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. తమ దేశంలో క్రికెట్ అభివృద్ధి, ప్రజాదరణ కోసం జపాన్ క్రికెట్ అసోసియేషన్ చాలా కాలంగా కృషి చేస్తోంది. ఈ తరుణంలో, భారత జట్టుతో జరగనున్న ఈ మ్యాచ్ స్థానిక క్రీడాకారులు, క్రికెట్ అభిమానులకు గొప్ప ఆకర్షణగా నిలవనుంది. చరిత్రాత్మక మ్యాచ్ లో వైభవ్ ! అయితే భారత పురుషుల క్రికెట్ జట్టు ఆసియా క్రీడల కోసం ఈ నెలలోనే జపాన్‌కు వెళ్లనుంది. 24న క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. అయితే, అంతకంటే రెండు రోజుల ముందే ఈ మ్యాచ్ జరగనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే అడుగుపెడుతున్న జపాన్ మధ్య ఈ పోరు ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే దాదాపు ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన జట్టుతోనే టీమ్ఇండియా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. ఒకవేళ అదే జరిగితే ఇందులో మన చిచ్చరపిడుగు 15ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆడే అవకాశం ఉంటుంది. కెరీర్ ప్రారంభించిన కొద్దిరోజులకే అతడికి ఇలాంటి చరిత్రాత్మక మ్యాచ్ లో ఆడే అవకాశం దక్కితే అతడి ఖాతాలో అరుదైన రికార్డు పడినట్లే! స్పోర్ట్స్ 75 భారత్ ప్రధాని నరేంద్రమోదీ – జపాన్ పీఎం సనా యె తకాయిచి మధ్య చర్చలు సఫలం అయినందున 'స్పోర్ట్స్ 75' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జరగనున్న తొలి కార్యక్రమం ఈ టీ20 మ్యాచ్. క్రీడల ద్వారా రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలను, సహకారాన్ని పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశం. అలాగే, 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే భారత ఆశయానికి జపాన్ సహకారం కూడా తోడ్పడనుంది.

# ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు ఖరారు- పూర్తి షెడ్యూల్ ఇదే

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఈ టోర్నమెంట్

ఈ లీగ్‌లో తలపడనున్న మొత్తం నాలుగు జట్లు




ఢిల్లి : ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) షెడ్యూల్ ఖరారైంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. సెప్టెంబర్ 19 నుంచి సెప్టెంబర్ 27 వరకు ఈ మ్యాచ్‌లు అట్టహాసంగా సాగనున్నాయి. ఈ లీగ్‌లో మొత్తం నాలుగు మేటి జట్లు తలపడనుండగా, ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరిగేలా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టోర్నమెంట్ ప్రారంభ వేడుక సెప్టెంబర్ 19న ఘనంగా జరగనుంది. మధ్యాహ్నం 1:30 గంటలకు రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీ లాంఛనంగా మొదలవుతుంది. అదే రోజు సాయంత్రం 6:00 గంటలకు 'అమరావతి ఈ ఛాంపియన్స్', వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు తలపడనున్నాయి. రాత్రి వేళల్లో జరిగే మ్యాచ్‌ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ లీగ్ దశలో ప్రతి జట్టూ మిగతా జట్లతో నిర్ణీత మ్యాచ్‌లు ఆడుతుంది. లీగ్ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో అత్యధిక మార్కులతో తొలి రెండు స్థానాల్లో నిలిచిన పటిష్టమైన జట్లు సెప్టెంబర్ 27న జరగనున్న తుది పోరు (ఫైనల్)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఒకవేళ ఫైనల్ మ్యాచ్ జరిగే రోజు వర్షం లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ఆటకి అంతరాయం ఏర్పడితే, మ్యాచ్ నిర్వహణ కోసం సెప్టెంబర్ 28ని ప్రత్యేక రిజర్వ్ డేగా నిర్వాహకులు కేటాయించారు.

### 'అమరావతి ఈ ఛాంపియన్స్' మ్యాచ్‌ల షెడ్యూల్

సెప్టెంబర్ 19: వైజాగ్ ఫైర్ బర్డ్స్ ఐం అమరావతి ఈ ఛాంపియన్స్ తలపడుతుంది. సెప్టెంబర్ 20: రాయలసీమ జెన్ స్టార్స్‌తో అమరావతి ఈ ఛాంపియన్స్ పోటీ పడుతుంది. సెప్టెంబర్ 21: గోదావరి గోల్డెన్ ఈగల్స్‌తో అమరావతి ఈ ఛాంపియన్స్ మ్యాచ్ ఉంటుంది. సెప్టెంబర్ 23: వైజాగ్ ఫైర్ బర్డ్స్‌తో అమరావతి జట్టు రెండోసారి అమీతుమీ తేల్చుకుంటుంది. సెప్టెంబర్ 24: గోదావరి గోల్డెన్ ఈగల్స్‌తో అమరావతి ఈ ఛాంపియన్స్ తదుపరి మ్యాచ్ ఆడుతుంది. సెప్టెంబర్ 25: లీగ్ దశలో చివరి మ్యాచ్‌గా రాయలసీమ జెన్ స్టార్స్‌తో అమరావతి జట్టు తలపడుతుంది.

### టీంలు- ఫ్రాంఛైజీలు

పురుషుల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా మహిళల లీగ్‌ను నిర్వహించేందుకు ఏసీఏ ఏర్పాట్లు చేస్తోంది. ఈ టోర్నీలో పాల్గొనే నాలుగు జట్ల కోసం విజయవాడలో జరిగిన ప్లేయర్ల వేలం ఆసక్తికరంగా సాగింది. వేలం ముగిసే సమయానికి మొత్తం 74 మంది మహిళా క్రికెటర్లు వివిధ ఫ్రాంఛైజీలకు ఎంపికయ్యారు. డబ్ల్యూఏపీఎల్‌లో నాలుగు జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఫ్రాంఛైజీలుగా అమరావతి ఈ–ఛాంపియన్స్‌కు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, వైజాగ్ ఫైర్ బర్డ్స్‌కు ఒరా మోటార్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్‌కు ఎన్ఎస్ఆర్ ఇండస్ట్రీస్, రాయలసీమ జెన్ స్టార్స్‌కు గ్యారిసన్ కన్‌స్ట్రక్షన్స్‌లు హక్కులను దక్కించుకున్నాయి.

### అమరావతి ఈ-ఛాంపియన్స్ జట్టు

రామోజీ గ్రూప్ కు చెందిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అమరావతి ఈ–ఛాంపియన్స్ జట్టును సొంతం చేసుకుంది. నీరగట్టు అనూష (బ్యాటర్), కాంద్రేగుల దేవిక(ఆల్‌రౌండర్), కాట్రగడ్డ దీక్ష(వికెట్ కీపర్), షబ్నమ్ షకీల్(ఆల్‌రౌండర్), పి.రంగలక్ష్మి (బ్యాటర్), తరుణి జోషిని (ఆల్‌రౌండర్), కట్టా మహంతి(బ్యాటర్ ), కె.హంస (ఆల్‌రౌండర్), అంకం విష్ణుప్రియ (బ్యాటర్), హేమసాయి రమ్య (బ్యాటర్), సాయిపూజిత (ఆల్‌రౌండర్), నక్కా సనా (బౌలర్), ఓరుగంటి సాహితీశ్రీ (ఆల్‌రౌండర్), ఎం.రుక్సార్ తబస్సుమ్, సాయిదీప్తి, బొడ్డుపల్లి తనిష్క, టి.మల్లిక, ఎం.సహస్రరెడ్డి

# రోహిత్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. అతని స్థానానికి ధోకా లేదన్న బీసీసీఐ

భారత సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలను బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా కొట్టిపారేశారు.




ఢిలి : భారత సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలను బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా కొట్టిపారేశారు. వన్డే జట్టులో ప్రస్తుతం అతని స్థానానికి ధోకా లేదని స్పష్టం చేశారు. గురువారం ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో బోర్డు మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌లో రోహిత్ శర్మ క్రికెట్ భవితవ్యంపై బోర్డు కీలక నిర్ణయం తీసుకుంటుందని వార్తలు వచ్చాయి. మీటింగ్ తర్వాత సైకియా మీడియాతో మాట్లాడుతూ.. రోహిత్ రిటైర్మెంట్ వార్తలను తోసిపుచ్చారు. రోహిత్ బాగా ఆడుతున్నాడని, వదంతులకు ఆజ్యం పోయద్దన్నారు. 'అన్ని మ్యాచ్‌ల్లోనూ రోహిత్ బాగా ఆడుతున్నాడు. ఇంకేం కావాలి?. తన చివరి మ్యాచ్‌లో అతను 130–140 స్కోరు చేశాడు. అయినా ఈ ఊహాగానాలు ఎందుకు?. ఊహాగానాలు చేసే వారికి నేను ఆజ్యం పోయాలనుకోవడం లేదు.'అని సైకియా తెలిపారు. అలాగే, ఇటీవల భారత ఆటగాళ్లు తరుచుగా గాయపడటం కూడా చర్చనీయాంశమైంది. దీనిపై సైకియా స్పందిస్తూ.. చాలా మ్యాచ్‌లు ఆడటం వల్ల ప్లేయర్లు గాయపడుతున్నారని చెప్పారు. 'ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన 15 మందిలో ముగ్గురు లేదా నలుగురు ప్లేయర్లు గాయపడ్డారు. ఆ టూరుకు ముందు వారు రెండు నెలలు ఐపీఎల్ ఆడిన విషయాన్ని మర్చిపోవద్దు. కాబట్టి, వారి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. అలాంటి పరిస్థితులను నివారించడానికి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నాం. గాయం తర్వాత ఒక ప్లేయర్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఎలా తిరిగి రావాలనే దానిపై మా వద్ద ప్రొటోకాల్ ఉంది. సరైన వ్యూహాలను రూపొందించడానికి కెప్టెన్లు, హెడ్ కోచ్ నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుంటాం. వచ్చే ఫ్యూచర్ టూర్ ప్రోగ్రాంలో సేనా దేశాలలో జరిగే ప్రధాన సిరీస్‌లకు ముందు ఆటగాళ్లకు సరైన విశ్రాంతనిస్తాం.,అక్కడి వాతావరణానికి అలవాటు పడటానికి ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తాం.'అని సైకియా చెప్పారు. ఈ సమావేశంలో ఇటీవల ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనలో భారత జట్టు ప్రదర్శనను సమీక్షించారు. అలాగే, పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్, సెక్రెటరీ సైకియా, వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యారు. అయితే, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకాకపోవడం గమనార్హం.

## 'రామాయణ' ఇంగ్లీష్ ట్రైలర్.. ఇక ప్రపంచంపై దండయాత్ర మొదలు!



భారతీయ చలనచిత్ర రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే సరికొత్త అధ్యాయం ఆరంభమైంది. సాధారణంగా భారతీయ చిత్రాలు ఇతర దేశాల భాషల్లోకి అనువాదం కావడం డిజిటల్ యుగంలో సాధారణమే అయినా.. హాలీవుడ్ స్థాయి మేకింగ్‌తో, విజువల్ వండర్‌గా రూపొంది నేరుగా ఆంగ్లంలో ప్రదర్శనకు సిద్ధమవడం సంచలనాత్మకమైన మార్పు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న అత్యంత భారీ బడ్జెట్ చిత్రం -రామాయణ- రూపంలో ఈ అరుదైన ఫీట్ సాధ్యమవుతోంది. ఈ ప్రయత్నంతో గ్లోబల్ బాక్సాఫీస్‌పై భారతీయ సినిమా దండయాత్ర అధికారికంగా మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భారీ విజువల్ స్పెక్టకిల్ ఆంగ్ల ట్రైలర్ ఇటీవల విడుదలై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భారతదేశం నుంచి ఇకపై వరల్డ్ క్లాస్ సినిమాలు వరుసగా రాబోతున్నాయనే బలమైన భరోసాని ఈ చిత్రం ఇస్తోంది. -రామాయణ- వేసిన ఈ గ్లోబల్ బాటను అనుసరిస్తూ భవిష్యత్తులో రాబోతున్న -వారణాసి-, -డ్రాగన్-, -కల్కి 2898 ఏడి 2-, రాకా వంటి భారీ ప్రాజెక్టులు కూడా నేరుగా ఆంగ్లంలోకి అనువాదమై ప్రపంచవ్యాప్తంగా విస్తృత స్థాయిలో విడుదలవుతాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ ఇంగ్లీష్ ట్రైలర్‌లో ఉపయోగించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డబ్బింగ్ సాంకేతికతపై సోషల్ మీడియాలో విభిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రైలర్‌లోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని, పాత్రల పెదవుల కదలికలకు సరిగ్గా సరిపోయేలా ఏఐ ద్వారా చేసిన లిప్-సింక్ విధానం చాలా బాగుందని కొందరు సాంకేతిక నిపుణులు-నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఈ తరహా గ్లోబల్ అప్పీల్ సినిమాను రూ. 5000 కోట్ల క్లబ్ వైపు తీసుకెళ్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ ఆంగ్ల వీక్షకుల నుంచి కొన్ని నిర్మాణాత్మక విమర్శలు కూడా వస్తున్నాయి. కేవలం ఏఐ పరిజ్ఞానంతో డబ్బింగ్ చెప్పించడం వల్ల సంభాషణల్లో ఉండాల్సిన సహజమైన భావోద్వేగాలు లోపించాయని వారు అభిప్రాయపడుతున్నారు. హాలీవుడ్ లేదా గ్లోబల్ ఆడియన్స్‌ను మానసికంగా కనెక్ట్ చేయాలంటే ఏఐ వాయిస్‌కు బదులుగా ప్రామాణిక యుకే లేదా యుఎస్ వాయిస్ ఆర్టిస్టులతో ప్రొఫెషనల్‌గా మళ్లీ డబ్బింగ్ చెప్పించాలని చిత్రబృందానికి సూచిస్తున్నారు. మొత్తానికి ఏఐ డబ్బింగ్ సాంకేతికత పరంగా నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టినా.. భావోద్వేగాలను పండించడంలో ఉన్న చిన్నపాటి లోపాలను సరిదిద్దాలని నెటిజన్లు కోరుతున్నారు. సాంకేతికతను, సహజత్వంతో మేళవించి ముందుకు వెళితే -రామాయణ- చిత్రం అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమా స్థాయిని మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయమని స్పష్టమవుతోంది.

## కుటుంబంతో రష్మిక.. ఎన్ని కోట్లు సంపాదించినా రాని సంతోషం!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న రష్మికా మందన్నా సినిమాలకు బ్రేక్ ఇచ్చి కుటుంబంతో సమయం గడుపు తున్నారు. నిరంతరం షూటింగ్‌లు, విమాన ప్రయాణాలు, బిజీ షెడ్యూళ్లతో తీరికలేకుండా గడిపే నేషనల్ క్రష్‌కు చిన్నపాటి గాయం .. అనారోగ్యం కారణంగా విరామం దొరికింది. కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉన్న ఈ భామకు ఆరోగ్య సమస్య ఒకరకంగా తన కుటుంబంతో కలిసి ఉండే సువర్ణావకాశాన్ని తెచ్చిపెట్టింది. వ్యాపారాలు, కోట్ల రూపాయల పారితోషికాలు, స్టార్‌డమ్ ఎంత ఉన్నప్పటికీ కుటు ంబంతో గడిపే ఆనందం ముందు అవేవీ సరి పోవని రష్మిక అనుభూతి చెందుతున్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో కుటుంబ సభ్యులకు దూరం అయిన అమ్మడు ఇప్పుడు పూర్తిగా ఇంటి పట్టునే ఉంటూ ఆనందంగా గడుపుతున్నారు. ఎంత సంపాదించినా దొరకని మానసిక ప్రశాంతత కుటుంబంతో గడిపే క్షణాల వల్లే సాధ్యమవుతుందని ఈ విరామం ద్వారా రష్మిక తెలుసుకుంటున్నారు. షూటింగ్ సెట్స్, కెమెరాలు, లైట్ల హడావుడికి దూరంగా ఇంట్లో కుటుంబ సభ్యులతో గడుపుతున్న క్షణాలు తనకు ఎంతో ఊరటని స్తున్నాయని సన్నిహితులు చెబుతున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తూ ప్రియమైన వాళ్లతో నవ్వుతూ గడుపుతున్న రోజులు రష్మికకు కోట్ల విలువైన సంపదలా కనిపిస్తున్నాయి. నిత్యం ఒత్తిడితో కూడుకున్న సినీ జీవితానికి ఇది అద్భుతమైన విరామమని చెప్పకనే చెబుతుంది. అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకోవాల్సి రావడం బాధాకరమే అయినా? అదే సమయంలో తనకు ఇష్టమైన కుటుంబంతో గడపడానికి సమయం దొరకడం సానుకూల పరిణామంగా భావిస్తున్నారు.

కెరీర్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఎక్కడా ఆగకుండా వరుస చిత్రాలతో దూసుకెళు న్న రష్మికకు ఈ విశ్రాంతి శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎంతో అవసరమైంది. ఆరోగ్యాన్ని మించిన సంపద లేదనే సత్యాన్ని ఈ సంఘటన మరోసారి నిరూపిస్తుంది. చిన్న విరామం ద్వారా రష్మిక తనలోని సృజనాత్మకతను పునరుద్ధరించు కోవడంతో పాటు, అప్ కమింగ్ ప్రాజెక్ట్‌ల కోసం కొత్త శక్తిని కూడగట్టు కుంటున్నారు. సినిమా పరిశ్రమలో ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా? వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతను ఈ అనుభవం ఆమెకు మరింత స్పష్టం చేస్తుంది. అభిమానులు సైతం తమ అభిమాన నటి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూనే.. కుటుంబంతో ఆనందంగా గడుపుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దొరికిన ఈ ప్రశాంతమైన సమయం రష్మికకు కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా జీవితంలోని అసలైన విలువలను మరోసారి గుర్తు చేస్తుంది. విరామం ముగిసిన తర్వాత రష్మిక మరింత ఉత్సాహంతో రెట్టింపు శక్తితో రంగుల ప్రపంచంలోకి అడుగు పెడుతుంది. సంపాదన, కీర్తి కంటే ఆప్యా యతలు, అనుబంధాలే మనిషికి అసలైన బలాన్ని ఇస్తాయనేదానికి రష్మిక జీవితంలోని ఈ ఘట్టం చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

## దీపికా పదుకొణే మళ్లీ టచ్ లోకి వచ్చేది ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె మరో సుందరమైన ఘట్టానికి సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఆమె రెండవ సారి గర్భం దాల్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆ విషయం బయటకొచ్చి రెండు మూడు నెలలు అవుతుంది. దీంతో దీపిక సినిమాలకు పూర్తిగా విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో దీపిక వృత్తిగత బాధ్యతలను పూర్తి చేసుకుంటూ విశ్రాంతి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్ లో -కింగ్- సినిమా షూటింగ్‌ను దీపికా సకాలంలో పూర్తి చేశారు. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం -రాకా- షూటింగ్ షెడ్యూల్‌ను కూడా త్వరలోనే ముగించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి కీలక భాగాలను పూర్తి చేసే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. -రాకా- షూటింగ్ పూర్తయిన వెంటనే అమ్మడు పూర్తిగా ఇంటికే పరిమితం కానున్నారు. దీంతో ఈ ఏడాది మిగిలిన కాలం ...వచ్చే ఏడాది ప్రారంభంలో దీపికా పదుకొణె కెరీర్ పరంగా ఎలాంటి కొత్త షూటింగ్స్‌లోనూ పాల్గొనే అవకాశం లేదు. ఆమె పూర్తిగా ఆరోగ్యం, మాతృత్వ విరామం , కుటుంబానికి మాత్రమే సమయం కేటాయించనున్నారు. దీపికా పదుకొణె మళ్లీ పూర్తి స్థాయిలో వెండితెరకు ..మీడియా ముందుకు టచ్‌లోకి వచ్చేది 2027వ సంవత్సరంలోనేనని తెలుస్తోంది. అయితే ఈ గ్యాప్‌లో -కింగ్- సినిమా రిలీజ్ డేట్ వస్తే? ఆ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌లో పాల్గొనే అవకాశః ఉంది. గర్భిణీగా ఉండి ప్రచారంలో పాల్గొనడం పరిపాటే. -కల్కి- రిలీజ్ సమయంలో కూడా గర్భంతోనే ముంబైలో మీడియా మీట్ కు దీపిక హాజరైన సంగతి తెలిసిందే. అంతకు ముందు కరీనా కపూర్, అలిమాభట్, రాణీ ముఖర్జీ లాంటి నటీమణులు కూడా గర్భంతోనే ప్రచార కార్యక్రమాలకు హాజరయ్యారు. కాబట్టి -కింగ్- ప్రచారంలో దీపిక తప్పక పాల్గొంటుంది. అలాగని ప్రతీ ఈవెంట్ కు అటెండ్ అవ్వదు. ఒక్క ఈవెంట్‌కు మాత్రమే పరిమితం కానుందని తెలుస్తోంది. నిరంతరం బిజీ షెడ్యూల్స్, గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో క్షణం తీరిక లేకుండా గడిపిన దీపిక మెటర్నిటీ బ్రేక్‌ను వ్యక్తిగత జీవితానికి అత్యంత ప్రశాంతంగా కేటాయించాలని భావిస్తున్నారు. అభిమానులు ఎంతగానో ఇష్టపడే నటి వెండి తెరకు కొద్ది నెలల పాటు దూరంగా ఉండటం ఓవైపు అభిమానులను బాధిస్తున్నా? ఆమె ఆరోగ్యమే ప్రధానమని అంతా భావిస్తున్నారు. గ్లామర్ ప్రపంచానికి బ్రేక్ ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదించబోతున్న దీపికా పదుకొణె 2027లో మరింత ఫ్రెష్‌గా, సరికొత్త ఉత్సాహంతో తిరిగి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అప్పటి వరకు దీపిక రికవరీ ..ఫ్యామిలీ లైఫ్ గురించిన అప్‌డేట్స్ మాత్రమే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యే అవకాశం ఉంది.

## నిర్మాతగా నిహారిక కొణిదెల అసలైన ప్రయాణం!



పరిశ్రమలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిహారిక కొణిదెల సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్‌గా ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి సంకల్పించారు. మెగా కుటుంబం నుంచి వచ్చినా? ఇండస్ట్రీలో తనకంటూ స్వతంత్ర గుర్తింపును సంపాదించుకోవాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లతో నిర్మాతగా సత్తా చాటిన అమ్మడు కెరీర్‌లో రాబోతున్న కొత్త చిత్రం ఓ మైలురాయిగా నిలవనుంది. గతంలో -కమిటీ కుర్రాళ్లు-, -రాకాస- వంటి విభిన్న చిత్రాలతో పాటు పలు ఆకర్షణీయమైన వెబ్ సిరీస్‌లను నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌లన్నీ ఎక్కువగా పరిమిత బడ్జెట్‌తో కొత్త టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ రూపొందించినవే. నూతన నటీనటులు .. సాంకేతిక నిపుణు లను పరిచయం చేస్తూ అమ్మడు చేసిన ప్రయోగాలు మంచి విజ యాన్ని అందుకున్నాయి. ఈ అను భవమే నిహారికలో పూర్తి స్థాయి పెద్ద సినిమాలను నిర్మించగల నమ్మకాన్ని నింపింది. నిహారిక ప్రొడక్షన్ హౌస్‌లో అత్యంత భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. అన్నయ్య వరుణ్ తేజ్ హీరోగా -భైరీ- అనే శక్తివంతమైన చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధానికే పరిమితం కాలేదు. తండ్రి నాగబాబు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం విశేషం. మెగా కుటుంబంలోని ఈ ముగ్గురి కలయిక వస్తున్న చిత్రంపై అన్ని వైపులా పాజిటివ్ బజ్ క్రియేట్ అవుతుంది. అయితే నిర్మాతగా నిహారిక అసలు సిసలు పరీక్షను ఎదుర్కొంటోందన్నది అంతే వాస్తవం. ఈ భారీ బడ్జెట్ సినిమాతో అమ్మడు బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోతుంది. మెగా కుటుంబంలోని ఇతర హీరోలతో పాటు, బయటి స్టార్ హీరోలు కూడా ఆమెకు డేట్స్ ఇచ్చేందుకు ముందుకొచ్చే అవకాశం ఉంది. ఒక నటిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి అగ్రశ్రేణి నిర్మాత స్థాయికి ఎదిగేందుకు ఈ చిత్రం అత్యంత కీలకమైన మలుపు కానుంది.

ప్రస్తుతం టాలీవుడ్‌లో పలువురు మహిళా నిర్మాతలు అద్భుతమైన చిత్రాలను నిర్మిస్తూ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. -భైరీ- సక్సెస్ సాధిస్తే నిహారిక కూడా ఆ లీడింగ్ లేడీ నిర్మాతలకు గట్టి పోటీదారుగా నిలవడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక్కడ విమర్శలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. విజయంతో ప్రశంసలు ఎంతో సంతోషాన్ని అందిస్తాయో? విమర్శలయకు అంతకు నాలిగింతలు కృంగదీస్తాయి. వాటన్నింటిని తట్టుకుని నిలబడినప్పుడే మార్కెట్ లో స్థిరంగా కొనసాగడానికి అవకాశం ఉంటుంది. ఈ ప్రయాణంలో రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని దాటుకుని ముందుకు వెళ్లడం అంతే కీలకం. ఇక్కడ ఓటమిని ఒప్పుకోని వాళ్లు మాత్రమే విజేతలుగా నిలుస్తారు. ఎంత సహకారం ఉన్నా? అది కొంత వరకే పని చేస్తుంది. ఆ తర్వాత ట్యాలెంట్ తోనే నెట్టుకురావాలి. నిహారికకు ఇప్పటికే ఇండస్ట్రీ అంటే కొంత అనుభవం ఉంది కాబట్టి వీటన్నింటిని సునాయాసంగానే దాటేస్తుందని అభిమానులంతా బలంగా నమ్ముతున్నారు. నిహారిక నిర్మాతగా సక్సెస్ అయితే? మెగా ఫ్యామిలీ..అభిమానుల ఆనందానికి అవదు లుండవ్.

## ది ప్యారడైజ్ టీజర్ రిలీజ్.. ఊర మాస్ లుక్ లో విశ్వరూపం చూపించిన నాని!

నాచురల్ స్టార్ నాని, మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి కల్ట్ బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నుంచి తాజాగా అదిరిపోయే టీజర్ విడుదలైంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో నెవర్ బిఫోర్ లుక్‌తో విశ్వరూపం చూపించారు. ప్రచార చిత్రం చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద పెద్ద జాతరే జరగబోతోందని అర్థమవుతోంది... టీజర్ ఎలా ఉంది? రగ్గడ్ అవతార్‌తో పూనకాలు: విడుదలైన టీజర్ మామూలుగా లేదు. 1980ల కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో, సమాజంలో అణచివేతకు గురైన వర్గం తమ ఉనికి కోసం చేసే పోరాటానికి నాయకుడిగా నాని కనిపిస్తున్నారు. "ఈ దేశం ఎవరిది? ఈ జాగా ఎవరిది?" అంటూ కత్తులు పట్టుకుని నాని అరిచే అరుపులు మాస్ ఆడియన్స్‌కు ఫుల్ మీల్స్ అని చెప్పాలి. ఇక కండలు తిరిగిన దేహంతో, జడల జుట్టుతో నాని ఇంటెన్స్ అవతార్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. మోహన్ బాబు గ్రేస్.. ఆ 'దృష్టి' డైలాగ్ కేక: టీజర్‌కి బిగ్గెస్ట్ హైలైట్ మాత్రం ఆ చివర్లో నాని చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్. "ఇరుగు దృష్టి, పొరుగు దృష్టి.. నల్లి గుట్లోన్ దృష్టి, బెదురు గుట్లోన్ దృష్టి..చెడు చూపులన్నీ పోవాలి అన్నీ దూరం కావాలి... థూ థూ థూ!అంటూ నాని చెప్పిన తీరు థియేటర్స్ లో పూనకాలు పుట్టించేలా వుంది. ఇక ఆ కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గారి స్టైల్, డైలాగ్ చెప్తే ఎలాంటి బేస్ ఉంటుందో, సేమ్ అదే వైబ్‌తో నాని థియేటర్లలో దద్దరిల్లేలా చేశారు. తారాగణం.. మోహన్ బాబు స్పెషల్ రోల్: ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తోంది. ఇక డైలాగ్ కింగ్ మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. వీరితో పాటు సీనియర్ నటులు తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, ఈశ్వరీ రావు మరియు బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు ఇతర ముఖ్యమైన పాత్రలలో మెరవనున్నారు. అనిరుధ్ మ్యూజిక్ మైండ్ బ్లాంక్: ఈ ఎస్.ఎల్.వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌ను వేరే లెవెల్‌కి తీసుకెళ్లింది. ఆ రగ్గడ్ విజువల్స్, అనిరుధ్ బిజిఎమ్ కలసి అభిమానులకు విజువల్ ట్రీట్‌గా మారాయి. ఇక ఈ సినిమా కోసం తెలుగు సినిమా హిస్టరీలోనే ఒక ఆల్ టైమ్ మాస్ బ్యాంజర్ మ్యూజిక్ అందిచగా, టీజర్‌లోని ప్రతి ఫ్రేమ్ మరియు షాట్ ఊహించని రీతిలో పీక్స్ లో ఉంటూ గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి.

నానిని ఇంతటి రౌద్ర రూపంలో, పవర్‌ఫుల్ వాయిస్ మోడ్యులేషన్‌తో డైలాగ్స్ చెప్పడం మనం ఎప్పుడూ చూడలేదు. 'జడల్' పాత్రలో ఆయన నటన వేరే లెవెల్‌లో ఉందనడంలో సందేహం లేదు, అలాగే మాస్ సినిమాలో ఇకపై "జడల్ జమానా షురూ" అని చెప్పడం ఖచ్చితంగా నిజం. సెప్టెంబరు 24న థియేటర్లలో జాతర: నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మాస్ డైలాగులు, ఇంటెన్స్ యాక్షన్, అద్భుతమైన టెక్నికల్ వేల్యూస్‌తో వస్తున్న 'ది ప్యారడైజ్' థియేటర్లలో కలెక్షన్ల నెత్తురు చిటపటలాడించడం ఖాయంగా కనిపిస్తోంది.




## రాజమౌళి 'మహాభారతం'లో దుర్యోధనుడి పాత్రకు ఎవరైతే కరెక్ట్?




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కలల ప్రాజెక్ట్ -మహాభారతం-. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కిం చాలని ఆయన చాలా కాలంగా కలలు కంటున్నారు. రకరకాల కారణాలతో ఇంతకాలం ఆలస్యమైంది. కానీ ఇప్పుడు నితీష్ తివారీ -రామాయణం- రగిలించే స్ఫూర్తితో -మహాభారతం- తెరకెక్కించేందుకు జక్కన్న సిద్ధమవుతారని అంచనా వేస్తున్నారు. ఆయన తెరకెక్కిస్తే అందులో పోషించాల్సిన కీలక పాత్రలపై ప్రపంచవ్యాప్తంగా చాలా చర్చ జరుగుతుందనడంలో ఎలాంటి సందేమం లేదు. అత్యంత ముఖ్యమైన -దుర్యోధనుడి- పాత్రను పోషించాలని ఉందని ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను వెల్లడించారు. మహాభారతంలో దుర్యోధనుడి పాత్ర అత్యంత క్లిష్టమైనదని.. ఆసక్తికరమైనదని మ్యాడీ అభిప్రాయపడ్డారు. కథను ఏ కోణం నుండి చెబుతున్నామనే దానిపైనే నాయకుడికి, విలన్‌కు మధ్య తేడా ఆధారపడి ఉంటుందని.. విధికి-కర్తవ్యానికి మధ్య నలిగిపోయి చివరికి కపటత్వంతో అంతమయ్యే దుర్యోధనుడి పాత్రను పోషించడం ఏ నటుడికైనా గొప్ప అవకాశమని మాధవన్ సరైన విశ్లేషణ చేశారు. దుర్యోధనుడు అనగానే కేవలం చెడు లక్షణాలు ఉన్న వ్యక్తి మాత్రమే కాదు.. అతడిలో అపారమైన రాజసం, గాంభీర్యం.. గదా యుద్ధంలో తిరుగులేని నైపుణ్యం.. స్నేహానికి ఇచ్చే విలువ.. పట్టుదల ఉంటాయి. ఈ తరహా సంక్లిష్టమైన పాత్రలోని భారీతనాన్ని గాంభీర్యాన్ని వెండితెరపై ఆవిష్కరించే నటులు భారతీయ చిత్రసీమలో చాలా అరుదుగా ఉంటారు. కేవలం శారీరక దారఢ్యమే కాకుండా.. కంటిచూపుతోనే గంభీరమైన భావాలను.. అహంకారాన్ని.. అంతర్మథనాన్ని పండించగల ప్రతిభ ఉన్న నటులకే ఈ పాత్ర సెట్ అవుతుంది. ఒకవేళ భారతీయ సినిమాలోని టాప్-10 నటులను పరిశీలిస్తే.. ఈ పాత్రకు అత్యంత పర్ఫెక్ట్‌గా సరిపోయే నటులలో -యంగ్ రెబెల్ స్టార్- ప్రభాస్ ఒకరు. -బాహుబలి-లో అమరేంద్ర బాహుబలిగా, రాజసంతో కూడిన యోధుడిగా ఆయన చూపించిన గాంభీర్యం, కటౌట్ దుర్యోధనుడి పాత్రకు నూటికి నూరు శాతం సరిపోతాయి. యాధృచ్ఛికంగానే ప్రభాస్ తన -కల్కి 2898 ఏడి- చిత్రంలో దుర్యోధనుడి స్నేహితుడు కర్ణుడిగా నటించారు. అయితే దుర్యోధనుడి పాత్రకు ప్రభాస్ కటౌట్ సరిగ్గా సరిపోతుందని ఒక అంచనా. అలాగే కన్నడ రాకింగ్ స్టార్ యష్ కూడా తన గంభీరమైన స్వరం.. పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్.. అగ్రెస్సివ్ నటనతో దుర్యోధనుడి అహంకారాన్ని, రాజసాన్ని తెరపై అద్భుతంగా పండించగలరు. ఇటీవల -రామాయణం- ట్రైలర్‌లో రావణుడిగా యష్ నటనకు గొప్ప గుర్తింపు దక్కుతోంది. అతడు దుర్యోధనుడి పాత్రకు యాప్ట్ అని విశ్లేషిస్తున్నారు. ఇక ఇతర అగ్ర నటులలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ యమగోల చిత్రంలో యముడిగా నటించి మెప్పించారు. అతడిలోని గాంభీర్యం దుర్యోధనుడి పాత్రకు సూటబుల్. ఇక తమిళంలో విక్రమ్ లేదా సూర్య వంటి నటులు తమ వైవిధ్యమైన అభినయంతో దుర్యోధనుడిలోని విషాదాన్ని, భావోద్వేగమైన అంతర్మథనాన్ని డెప్త్ తో చూపించగల సమర్థులు. బాలీవుడ్ నుంచి రణ్‌వీర్ సింగ్ ఇప్పటికే -పద్మావత్-లో ఖిల్జీగా చూపించిన భయంకరమైన ఆరా, ఎనర్జీతో దుర్యోధనుడి పాత్రకు కొత్త కోణాన్ని ఇవ్వగలరు. అయితే ఆర్. మాధవన్ చెప్పినట్లుగా దుర్యోధనుడిని కేవలం విలన్‌గా కాకుండా ఒక -ట్రాజిక్ హీరో-గా చూపిస్తే మాధవన్ లాంటి పరిణతి చెందిన నటుడు కూడా ఆ పాత్రలోని నైతిక ఘర్షణను అత్యద్భుతంగా ఆవిష్కరించగలరు. రాజమౌళి తీసే -మహాభారతం-లో దుర్యోధనుడి పాత్రకు భీకర రూపం.. గంభీరమైన కటౌట్.. అసాధారణ నటకౌశలం కలబోసిన ప్రభాస్, యష్, ఎన్టీఆర్ అత్యంత సూటబుల్ నటులు అనడంలో సందేహం లేదు. ఎందుకంటే రాజమౌళి లార్జర్-ద్యాన్-లైఫ్ శైలికి వారిద్దరి మాస్ ఇమేజ్, బాడీ లాంగ్వేజ్ సరిగ్గా సరిపోతాయి. ఏది ఏమైనా మహాభారతాన్ని రాజమౌళి ఏ కోణంలో రాస్తారు? దుర్యోధనుడి పాత్రకు ఏ నటుడిని ఎంచుకుంటారో చూడటం భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ఆసక్తికరమైన అంశంగా మారనుంది.

## "గ్లోబల్ టూరిజం అని బిల్డప్.. తీరా చూస్తే పరువు పాయే"




కోల్‌కతా: కొన్ని సార్లు మనం ఏదో గొప్పగా చేయాలనుకున్న పనే మనకు ఇబ్బందులు తెచ్చిపడుతుంది. తాజాగా బెంగాల్ సీఎం సువేందు అధికారి పరిస్థితి అలానే ఉంది. బెంగాల్ టూరిజంను ప్రపంచస్థాయిలో దెవలఫ్ చేద్దామనుకొని అన్ని హంగులతో ఒక నిమిషం నిడివి గల వీడియోని రూపొందించారు. అయితే అదే ఇప్పుడు ట్రోలింగ్‌కు గురవుతుంది. అసలు ఈ టూరిజం వీడియోల బెంగాల్ ఎక్కడుందంటూ నెటిజన్స్ ఆయనను తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. ఇటీవల వెస్ట్ బెంగాల్ సీఎం సువేందు అధికారి రాష్ట్రంలోని పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 500 కోట్ల నిధులను ప్రకటించారు. అంతేకాకుండా నిన్న (శుక్రవారం) బెంగాల్ సాంస్కృతిక వారసత్వాన్ని భారతదేశం భిన్నంగా భావించే చోటు' అనే క్యాచ్‌లైన్‌తో ఒక లోగోనుఎంతో ఆర్భాటంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సువేందు మాట్లాడుతూ" మనం మన రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాలను నాశనం చేశాం. పర్యాటకులు మన రాష్ట్రంలోని డార్జిలింగ్, కాలింపాంగ్ మీదుగా సిక్కింకు వెళతారు. దీనిని మార్చడానికి మేము నిశ్చయించుకున్నాము," అని అన్నారు. అయితే ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియో ఇప్పుడు ఆయనకు తలనొప్పిగా మారింది. బెంగాల్ టూరిజం వీడియోలో.. ఈఫిల్ టవర్, రష్యాలోని సెయింట్ బాసిల్ కేథడ్రల్, పిరమిడ్లు, రియోలోని క్రైస్ట్ ది రిడీమర్ ఉన్నాయి. బెంగాల్‌కు చెందిన ప్రసిద్ధ హౌరా వంతెన మాత్రమే అలా వచ్చి వెళ్లిపోతుంది. దీంతో ఇది చూసిన నెటిజన్స్ ఇక్కడ అసలు బెంగాల్ ఎక్కడ ఉంది అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అసలు ఇందులో బెంగాల్‌కు సంబంధించిన ప్రదేశాలు ఎక్కడున్నాయని ప్రశ్నిస్తున్నారు.

### పొలిటికల్ సెటైర్స్

అయితే ఈ టూరిజం వీడియోపై స్వంత పార్టీలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బీజేపీ సీనియర్ నేత త్రిపుర, మేఘాలయ మాజీ గవర్నర్ తథాగత రాయ్ దీనిపై తీవ్ర విమర్శలు చేశారు. ఇది "మూర్ఖపు" "అనుభవం లేని వీడియో" అని అభివర్ణించారు. వెంటనే దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. "పశ్చిమ బెంగాల్‌పై తీసిన వీడియోలో మాస్కో, ఈజిప్ట్, రియో ??డి జనీరో దృశ్యాలు ఎందుకు ఉండాలి?" అని ప్రశ్నించారు. దీనిని రూపొందించిన వ్యక్తిని మత్స్యశాఖకు లేదా అలాంటి మరేదైనా విభాగానికి బదిలీ చేయాలని నేను సూచిస్తున్నాను అని వ్యంగ్యంగా మాట్లాడారు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయన్ "ఈ వీడియోకు 'చెత్త' అనే పదం కూడా చాలా తక్కువైనది అని ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

## 'మూడు పార్టీలు కలిసి ఉన్నా పోటీకి భయపడుతున్నాయి'




చోడవరం(అనకాపల్లి జిల్లా): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కూటమి భయపడుతుందన్నారు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్నాథ్. కూటమిలో మూడు పార్టీలు కలిసి ఉన్నా పోటీ చేయడానికి భయపడుతున్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోటీకి దిగుతుందని స్పష్టం చేశారాయన. చంద్రబాబులా వైఎస్ జగన్ తప్పించుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు తప్పించుకునే ప్రయత్నం చేశారని, ఆ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయడం లేదని ప్రకటించారన్నారు. ప్రజా సమస్యలు మీద వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం చేస్తుందని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. చోడవరం, షుగర్ ఫ్యాక్టరీ రైతులకు రూ. 30 కోట్లు, ఉద్యోగులకు రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరొక 15 రోజుల్లో బకాయిలు ఇవ్వకపోతే ఈనెల 21వ తేదీన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## ఇది దేవుడు చెప్పిన సత్యం: బొత్స



అనకాపల్లి: చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువేనని.. ఇది దేవుడు చెప్పిన సత్యం అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో ఎక్కడ చూసినా మైనింగ్ జరుగుతుంది. ఏపీ గంజాయి మత్తులో తూగుతోంది. వాస్తవాలను చెబుతున్నప్పుడు సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేసే అధికారం ఎవరిచ్చారు?" అంటూ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. "వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు పదివేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చాము. సుమారు లక్షల 50 వేల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేశాం. ఎక్కడైనా మాపై ఒక చిన్న ఆరోపణ వచ్చిందా? ఎక్కడైనా డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆధారాలు లభించాయా?. వైఎస్ జగన్ పాలనలో ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరిగింది. కూటమి పాలనలో స్పోర్ట్స్ కోటాలో పరీక్ష లేకుండా ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగాలు ఇవ్వడం కోసం ఒక జీవో తీసుకువచ్చారు. ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత ఆ జీవోను రద్దు చేశారు" అంటూ బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఉద్యోగాల కోసం బేరాలు పెట్టారు. శాసనమండలిలో చర్చకు రమ్మంటే తోక ముడిచి పారిపోయారు. విశాఖ నగరాన్ని సర్వనాశనం చేశారు. గీతం యూనివర్సిటీకి వేల కోట్లు చేసే భూములు అప్పగించారు. ఎవడబ్బ సొమ్ము అని 3 వేల కోట్లు ధారాదత్తం చేస్తారు?. గ్రావిటీ ద్వారా పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా శ్రీకాకుళం చివరికి నీరు ఇవ్వాలి. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇచ్చి గోదావరి జలాలు ఇచ్చామని ప్రచారం చేస్తారా?. పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది వైఎస్సార్.. అందుకు నేను సాక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి గెలిచి తీరాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబులా పారిపోయే మనస్తత్వం వైఎస్ జగన్‌ది కాదు" అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

## సురేఖ ఎపిసోడ్, కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్: తెలంగాణలో కేబినెట్ విస్తరణ అంశం, కొండా సురేఖ ఎపిసోడ్‌పై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అలాగే, కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారం జరుగుతుందని తెలిపారు. మీడియా చిట్ చాట్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..'కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది. కేబినెట్ విస్తరణపై హై కమాండ్ నుండి ఎలాంటి సమాచారం లేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం. నాకు మంత్రి పదవి అనే ప్రచారంపై నాకు మాత్రం సమాచారం లేదు. అవన్నీ ఊహాగానాలే. అలాగే, కొండా సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. సురేఖ విషయంలో అందరం మా వంతు ప్రయత్నం చేశాం. సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశాం. రాబోయే వంద రోజులు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తాం. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయండి' అని పిలుపునిచ్చారు. మరోవైపు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బండి సంజయ్, అరవింద్, ఈటల, లక్ష్మణ్ బీసీల అంశంపై స్పందించాలి. అడిగితే పదవులు పోతాయని బీజేపీ బీసీ నేతలు భయపడుతున్నారా?. తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా తేల్చుకోండి. కుల గణనలో దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నాం. తెలంగాణ చేసిన కులగణనలో అన్ని విషయాలు పొందుపరిచాం. మేం పంపిన ఫైల్‌పై కేంద్రం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదు? అని ప్రశ్నించారు.

# జెన్-జీలోనూ మొహమాటపు పోకడలు!

## కెరీర్‌కు సాయపడేవారినీ కలవడం లేదు రకరకాల మొహమాటాలు లింక్డిన్ నివేదిక



జెన్--జీ అంటే కేర్‌ఫ్రీ అనుకుంటున్నాం కానీ వారిలోనూ ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అనే మొహమాటం ఉన్నట్లు తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ఈ మొహమాటం కారణంగా వారు కెరియర్‌లో ఎదిగేందుకు సాయపడగల వ్యక్తులను సంప్రదించడం లేదని, నెట్‌వర్కింగ్‌కు ఆసక్తి చూపడం లేదని లింక్డ్ఇన్ జరిపిన ఈ అధ్యయనం తెలిపింది. బుధవారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం నిత్యం ఆన్‌లైన్‌లోనే ఉండే తరానికి చెందిన జెన్--జీ ప్రొఫెషనల్స్‌లో 83 శాతం మంది ఈ రకమైన పోకడలు చూపుతున్నట్లు తెలిసింది. జడ్జ్ చేస్తారేమో అన్న సంకోచం 44 శాతం మందిని పీడిస్తూంటే.. ఇతరులకు ఇబ్బంది కలుగుతుందేమో అన్న మొహమాటంతో 39 శాతం మంది సాయపడే వారికి దూరంగా ఉంటున్నారట. మరీ కృతకంగా ఉంటుందేమో అన్న అనుమానంతో ఇతరుల సలహాలు కోరడం, రిలేషన్‌షిప్‌ను మెయిన్‌టెయిన్ చేయడం, కొత్త అవకాశాలను అందుకోవడం వంటివి చేయని వారు సుమారు 37 శాతం మంది ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. భారత్‌తోపాటు యూకే, యూఎస్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్, సింగపూర్, బ్రెజిల్, యూఏఈ, సౌదీ అరేబియాల్లో ఈ ఏడాది జూలై 20వ తేదీ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకూ దాదాపు 18,050 మంది పార్ట్‌టైమ్ ఉద్యోగుల (18 -- 80 ఏళ్ల వారు)ను ప్రశ్నించడం ద్వారా ఈ నివేదిక రూపుదిద్దుకుంది. భారత్ విషయానికి వస్తే... జెన్--జీలో 79 శాతం మందికి ప్రొఫెషనల్ రిలేషన్‌షిప్స్ అవసరం, ప్రాముఖ్యత గురించి తెలుసు. కానీ సంగం కంటే ఎక్కువ మంది (53 శాతం) వీటిని ఎలా మొదలుపెట్టాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు 53 శాతం మంది పరిచయస్తులను (కాంటాక్ట్‌లు) అసలైన కనెక్షన్స్‌గా మార్చుకోవడం ఎలాగో తెలియక ఇబ్బంది పడుతున్నారు. దీనికి ఖర్చులవుతాయన్న ఆందోళన అదనం. లింక్డ్ఇన్ డేటా ప్రకారం ఆయా కంపెనీల్లో ఎవరైనా తెలిసి ఉంటే ఇతరులతో పోలిస్తే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు దాదాపు 8.5 రెట్లు ఎక్కువ. అయితే, జెన్--జీలో సుమారు 59 శాతం మందికి ప్రొఫెషనల్ రిలేషన్‌షిప్స్ ఎలా పెంపొందించుకోవాలో ఎవరూ చెప్పలేదట. చాలామంది తమంతట తాము నేర్చుకోవడమో.. లేక పరిమితమైన సలహా, సూచనల ద్వారా ముందుకెళ్లడమో చేశారని లింక్డ్ఇన్ నివేదిక చెబుతోంది. ఫలితంగా ఉద్యోగం కోసం లేదా వృత్తిలో ఎదిగేందుకు ఎవరిని సంప్రదించాలి? ఎప్పుడు సంప్రదించాలి? ఏం మాట్లాడాలి? వంటి విషయాలపై అవగాహన పెంచుకోవడం కష్టమవుతోందని తెలిపింది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. జెన్--జీ ఈ సమస్యలు ఎదుర్కొంటూంటే మిలినియల్స్ (1981--1996 మధ్య పుట్టిన వారు), అంతకు ముందు తరం జెన్ ఎక్స్ (1965--1980 మధ్య పుట్టిన వారు) ఉద్యోగులు మాత్రం అప్పుడే ఉద్యోగాల్లోకి చేరిన అపరిచితులకు సైతం తాము సాయం చేస్తామని చెప్పడం విశేషం.

# పెద్దన్నా.. ఏంటీ కన్ఫ్యూజన్? ఆంక్షలా.. దాడులా?

ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహం ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఒకవైపు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను క్రమంగా ఉక్కిరిబిక్కిరి చేసేలా కఠిన ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తున్న ట్రంప్.. మరోవైపు అవసరమైతే ఇరాన్‌పై భారీ సైనిక దాడులు తప్పవంటూ బెదిరిస్తున్నారు. ఆ వెంటనే అదో చిన్న యుద్ధమంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ విషయంలో పెద్దన్న వైఖరిలో స్పష్టత కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ బలగాల సంయుక్త దాడితో పశ్చిమాసియా యుద్ధం మొదలైంది. అంటే ఆర్నెలు పూర్తయ్యిందన్నమాట. అయితే ఇరాన్‌పై అమెరికా తాజాగా మరోసారి సైనిక చర్యకు దిగింది. దాదాపు నెల రోజుల తర్వాత జరిగిన దాడి ఇది. హర్మూజ్ జలసంధిలో సముద్ర గనులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ అమెరికా సైన్యం.. ఇరాన్ రాకెట్ లాంచర్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్ మరో అడుగు ముందుకేశారు. ఇరాన్ కీలక ఇంధన కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని 'తునాతునకలు చేస్తాం' అంటూ సోషల్ మీడియా వేదికగా ఓ ఏఐ వీడియోతో హెచ్చరించారు. అయితే దీనికి కొద్ది రోజుల ముందే అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ మరో వ్యూహాన్ని ప్రకటించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసేలా కొత్త ఆంక్షలను అమలు చేయనున్నామని.. దీనిని ఆయన 'ఆర్థిక డీ-డే'గా అభివర్ణించారు. ఈ ఆర్థిక ఒత్తిడి ద్వారా ఇరాన్‌ను చర్చల బాట పట్టించవచ్చని.. తద్వారా మరోసారి సైనిక ఉద్రిక్తతకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన సంకేతాలిచ్చారు. ఇరాన్ యుద్ధం విషయంలో ట్రంప్ పట్ల ప్రజాదరణ క్రమంగా తగ్గిపోతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయి. ఈ అటు ప్రత్యర్థి డెమొక్రట్లే కాదు.. ఇటు సొంత పార్టీ రిపబ్లికన్‌లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### 'ఏ వ్యూహమో ఏమో.. ఏమీ అర్థం కావడం లేదు'

ఆరు వారాల్లో ముగుస్తుందని ట్రంప్ గతంలో చెప్పిన యుద్ధం.. ఆరు నెలలు దాటినా కొనసాగుతుండటం కూడా ప్రశ్నలకు తావిస్తోంది. ట్రంప్, ఆయన కేబినెట్ సభ్యులు పలుమార్లు ఈ యుద్ధం ముగిసిందని, అమెరికా విజయం సాధించిందని ప్రకటించినప్పటికీ.. ఇరాన్‌తో ఉద్రిక్తతలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. ట్రంప్ వైఖరిలో తరచూ కనిపిస్తున్న ఈ మార్పులపై అమెరికా రాజకీయ వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోంది. ట్రంప్ పాలనలోని విధానాలపై అవగాహన ఉన్న మాజీ భద్రతా అధికారి ఒకరు.. ఇరాన్‌పై యుద్ధం స్పష్టమైన ప్రణాళిక లేకుండానే ప్రారంభమైందని, ఇప్పటికీ పరిస్థితులకు అనుగుణంగానే నిర్ణయాలు మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

ట్రంప్‌తో ఎవ్వరూ సంతృప్తిగా లేరా?

రిపబ్లికన్ పార్టీలో ఇరాన్ ఉద్రిక్తతలపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. యుద్ధం మరింత పొడిగితే చమురు ధరలు పెరిగి.. అమెరికన్లపై భారం పడుతుందని, వచ్చే మధ్యంతర ఎన్నికలపై ప్రభావం చూపొచ్చని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా యుద్ధంపై అప్రమత్తంగా ఉన్న వర్గాలు సైతం సంఘర్షణ త్వరగా ముగియాలని కోరుకుంటున్నాయి. మరోవైపు ఇరాన్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని కోరుకునే హార్డ్‌లైన్ వర్గం కూడా ట్రంప్ తీరుపై పూర్తిగా సంతృప్తిగా లేదు. ట్రంప్ ప్రచార బృందంలో పని చేసిన ఓ మాజీ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌ను అదుపులోకి తీసుకురావాలన్న ట్రంప్ లక్ష్యాన్ని సమర్థించే రిపబ్లికన్లు కూడా ప్రస్తుత పరిణామాలతో అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. మరో రిపబ్లికన్ వ్యూహకర్త ఈ పరిస్థితిని సరదాగా 'ఫ్రెండ్లీ జోన్‌లో చిక్కుకున్నట్లుంది' అంటూ అభివర్ణించారు. అంటే.. ట్రంప్ తీసుకుంటున్న ఏ నిర్ణయం కూడా పూర్తిగా ఏ వర్గాన్నీ సంతృప్తిపరచడం లేదన్నమాట.

### మధ్యంతర ఎన్నికల వేళ పెరుగుతున్న ఒత్తిడి

అమెరికాలో మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరాన్ యుద్ధం ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా కూడా సవాలుగా మారుతోంది. ఇప్పటికే అధిక ధరలతో అమెరికన్లు ఇబ్బంది పడుతున్న సమయంలో.. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు చమురు సరఫరాపై ప్రభావం చూపితే పరిస్థితి మరింత కఠినంగా మారే అవకాశం ఉంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా గతంలో ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరిగేది. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పటికే ఆందోళన కలిగిస్తున్నాయి.

### 'ఇది వ్యూహంలో భాగమే'

అయితే ట్రంప్ ప్రభుత్వానికి సన్నిహితంగా ఉన్నవారు మాత్రం ఈ పరిణామాలను మరోలా చూస్తున్నారు. ఇరాన్‌పై సైనిక, ఆర్థిక ఒత్తిడిని ఒకేసారి కొనసాగించడం ఉద్దేశపూర్వక వ్యూహమేనని వారు చెబుతున్నారు. ఒకవైపు హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు పూర్తిగా నిలిచిపోకుండా ఒత్తిడి కొనసాగిస్తూ.. మరోవైపు ఆంక్షల ప్రభావం ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై పడే వరకు వేచి చూడాలన్నది ట్రంప్ వ్యూహంగా వారు పేర్కొంటున్నారు. మాజీ అమెరికా రాయబారి జేమ్స్ జెఫ్రీ కూడా తాజా పరిణామాలను ఇరువైపులా జరుగుతున్న ప్రతిచర్యలుగానే అభివర్ణించారు. ఇరాన్, అమెరికా రెండూ పూర్తిస్థాయి దాడులకు తిరిగి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు కనిపించడం లేదని పేర్కొన్నారు.

యుద్ధం త్వరగా ముగిస్తే మంచిది

ఇదిలా ఉండగా.. ట్రంప్ యంత్రాంగంలోనే యుద్ధాన్ని ముగించాలన్న అభిప్రాయం బలపడుతున్నట్లు చర్చ జరుగుతోంది. చమురు పరిశ్రమకు చెందిన ఓ ఉన్నతాధికారి ప్రకారం.. ఘర్షణలను ముగించాలన్న ఒత్తిడి భారీగా ఉంది. ఇరాన్ పూర్తిగా బలహీనపడే వరకు ఒత్తిడి కొనసాగించాలని భావించే అధికారులు కూడా ఉన్నారు. ఇరాన్‌ను తీవ్ర ఆర్థిక, సైనిక ఒత్తిడిలోకి నెట్టినప్పుడే అది అమెరికాతో తమకు అనుకూలమైన ఒప్పందానికి వస్తుందని వాళ్లు అభిప్రాయపడుతున్నారు.

ఇరాన్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు

అమెరికా విధిస్తున్న ఆంక్షలు తమను చర్చల బాట పట్టిస్తాయన్న వాదనను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. అమెరికా వాదనలు అబద్ధాలంటూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘలీబాఫ్ విమర్శించారు. అమెరికా ఆంక్షల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చైనా కూడా ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఇరాన్ నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేసే చైనా.. అంతర్జాతీయ చట్టాలకు ఆధారం లేని ఏకపక్ష అమెరికా ఆంక్షలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. మొత్తంగా.. ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి మాత్రం తగ్గడం లేదు. ఆర్థిక ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి చేయాలా? సైనిక దాడులతో లొంగదీసుకోవాలా? లేక ఒత్తిడితోనే చర్చల బాట పట్టించాలా? అన్నది మాత్రం స్పష్టంగా కనిపించడం లేదు. ఒకవైపు యుద్ధం ముగిసిందంటూనే.. మరోవైపు దాడుల హెచ్చరికలు చేయడం, ఆ తర్వాత మళ్లీ చర్చలకు సంకేతాలివ్వడం అమెరికా వ్యూహంపై సందేహాలకు తావిస్తోంది. ఇరాన్‌ను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ట్రంప్ నిర్ణయం ఏదైనా కావొచ్చు.. కానీ యుద్ధాన్ని ఎప్పుడు, ఎలా ముగించాలన్నదే ఇప్పుడు ఆయన ముందున్న అసలు సవాలు!.

# ఆమె కన్నీటి శాపమే.. నేపాల్‌ను వెంటాడుతోందా?

ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడడం, భూకంపాలు.. వరుస ప్రకృతి విపత్తులు ఓవైపు తరచూ తలెత్తుతున్న రాజకీయ సంక్షోభాలు మరోవైపు. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఏ ముప్పు ఎటు నుంచి ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులతో పశుపతి నేల నేపాల్ సతమతమవుతోంది. తాజా జల విలయం కూడా ఆ దేశం ఎదుర్కొంటున్న కష్టాలను మరోసారి కళ్లకు కట్టింది. ఇలాంటి పరిస్థితులు తమకు బాగా అలవాటేనని, కోలుకోవడం కూడా సాధారణమేనని నేపాల్ చెబుతున్నప్పటికీ.. ఈ పరిస్థితుల వెనక ప్రచారంలో ఉన్న ఓ గాథ తాజాగా తెరపైకి వచ్చింది. 'సతి లే సరాపేకో దేశ్'.. సతి శాపానికి గురైన దేశం. నేపాల్ రాజకీయాల్లో తరచూ వినిపించే మాట ఇది. రాజరికం అంతరించి పోయిన సమయంలో.. అలాగే వరుసగా ప్రభుత్వాలు కూలినప్పుడల్లా ఈ పదం నెట్టింట వైరల్ అవుతుంటుంది. ఇది కేవలం ఇందుకే పరిమితం కాలేదు.. ప్రకృతి ప్రకోపం చూపించినప్పుడు కూడా అక్కడి జనాలు దీనిని గుర్తు చేసుకుంటారు. అసలు నేపాల్ శపించిన ఆ మహిళ ఎవరు? ఆమె విషాద గాథ ఏంటి? సతీసహగమన సమయంలో ఆమె పెట్టిన కన్నీరే నేపాల్ దుస్థితికి కారణమా?.. నాలుగు వందల ఏళ్ల కిందట జరిగింది ఏంటి?.. నేపాల్‌లో 17వ శతాబ్దంలో ఖాట్మాండు లోయను మల్ల రాజులు పరిపాలించేవారు. అధికారం, ఆధిపత్య పోరులతో రాజదర్బాలు కుట్రలకు, కుతంత్రాలుగా నిలయంగా కనిపించేవి. ఆ వంశంలో రాజు లక్ష్మీ నరసింహ మల్లా కొలువులో కాజీ భీమ్ మల్లా అనే సేనాపతి ఉండేవాడు. సైనిక వ్యవహారాల్లోనే కాకుండా పరిపాలన, టిబెట్‌తో వాణిజ్య సంబంధాల్లోనూ ఆయన రాజుకు చేదోడు వాదోడుగా ఉంటూ కీలక వ్యక్తిగా ఎదిగారు. రాజు వద్ద ఆయనకు పెరుగుతున్న ప్రాధాన్యం.. సాధారణంగానే సామంత రాజుల్లో అసూయను పెంచింది.

### చాడీలు విని..




భీమ్ మల్లాపై కుట్రలు పన్నిన ప్రత్యర్థులు.. రాజు లక్ష్మీ నరసింహుడికి లేనిపోని వన్నీ నూరిపోశారు. దాంతో తన సింహాసనానికి భీమ్ ముప్పుగా మారుతున్నాడేమో అని అనుమానం పెంచుకున్నారాయన. అలా రాజద్రోహం ఆరోపణలతో ఎలాంటి విచారణ జరపకుండానే ఆయన్ని చెరసాలలో బంధించి.. మరణశిక్ష అమలు చేశారు. అది చూసి.. ఆయన భార్య భువనలక్ష్మి గుండె పగిలేలా రోదించింది. రాజ్యం సైతం కన్నీరు పెట్టింది.

### చితిపై నుంచే శాపం?

నమ్మిన బంటుగా ఉన్న వ్యక్తిని లక్ష్మీ నరసింహుడు అకారణంగా, కుట్రలకు తలొగ్గి చంపడాన్ని భువనలక్ష్మి తట్టుకోలేకపోయారు. ఆ కాలంలో నేపాల్‌లో సతి ఆచారం ఉండేది. భర్త మరణించిన తర్వాత భార్య కూడా అతడి చితిపై ఆత్మాహుతి చేసుకునే పరిస్థితులు ఉండేవి. భువనలక్ష్మి కూడా భర్త భీమ్ మల్లా చితిపై ఆత్మార్పణం చేసుకున్నారు. అయితే అంతకు ముందు తన భర్తకు జరిగిన అన్యాయంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను అన్యాయంగా చంపిన ఈ నేల, ఈ రాజ్యాన్ని మనశ్శాంతిగా ఉండబోవని, సర్వనాశనం అవుతాయని శపించారు. ఆ తర్వాత రాజు లక్ష్మీ నరసింహుడు సైతం తన పశ్చాత్తాపం వ్యక్తం చేశాడని.. ఆయన కాలంలోనే వరదలు సంభవించాయని చెబుతుంటారు. అలా ఆమె శాపం నాలుగు వందల ఏళ్లుగా కొనసాగుతూనే ఉందని ఓ జానపద కథ ప్రచారంలోకి వచ్చింది. ఆ గాథ నుంచే 'సతి లే సరాపేకో దేశ్'(ఞఛఱ శ్రీవ ఞఋతీుజూవ ఎశీ ఱవంప్త్ర) అనే పదబంధం పుట్టిందని చెబుతారు. అయితే కాలక్రమంలో ఈ గాథ భువనలక్ష్మి అనే మహిళ కన్నీటి కథకు మాత్రమే పరిమితం కాలేదు. నేపాల్‌లో తరచూ తలెత్తిన రాజకీయ అస్థిరత, అధికార పోరాటాలు, పాలనా సంక్షోభాలు.. అదనంగా ముంచెత్తున్న ప్రకృతి విపత్తులను ప్రస్తావించేటప్పుడు ఈ పదబంధాన్ని వ్యంగ్యంగా, ఆవేదన పూరితంగా ఉపయోగించడం మొదలైంది. ఇప్పుడు ఆకస్మిక వరదల వల్ల మళ్లీ తెరపైకి వచ్చింది.

## ఈ నెల 9న కురుమద్దాలిలో భారీ జాబ్ మేళా -
## 490 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు .... జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ నిరుద్యోగ యువతకు శుభవార్త. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు పామర్రు మండలం కురుమద్దాలిలోని రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, తెలిపారు.ఈ జాబ్ మేళాలో బంధన్ బ్యాంక్, ట్రైన్స్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్, ఎస్బీఐ లైఫ్, కురకు ఫైనాన్షియల్ సర్వీసెస్, అడెక్కో ఇండియా, వరుణ్ మోటార్స్, టీమ్ రెడ్ (డీబీఎస్ బ్యాంక్), పేటీఎం సర్వీసెస్, మెడ్ ప్లస్, ఎల్విన్ ఎనర్జీ వంటి 11కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని 490కి పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. పి. నరేష్ కుమార్ తెలిపారు.టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన 18 నుండి 35 ఏళ్ల లోపు యువత ఈ ఉద్యోగాలకు అర్హులని, ఎంపికైన వారికి మంచి వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా వెబ్ సైట్ నందు తమ వివరాలతో రిజిస్టర్ కావాలని, జాబ్ మేళాకు వచ్చేటప్పుడు రెజ్యూమె / బయోడేటా, ఆధార్, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, పాన్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79813 68429, 96187 13243 నంబర్లను సంప్రదించాలన్నారు.నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఆంజనేయస్వామి అనుగ్రహంతో టిట్కో కాలనీ మరింత అభివృద్ధి చెందాలి...గొర్రెపాటి గోపీచంద్, పి.వి.ఫణి కుమార్



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ గో సంఘంలోని టీట్కో కాలనీలో ఆదివారం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ కాలనీవాసులు ప్రత్యేక హోమం నిర్వహించి,ఆంజనేయస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ లు టిట్కో కాలనీవాసులతో కలసి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, హోమాధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడుతూ.శ్రీరాముని పట్ల భక్తి, ధర్మం పట్ల నిబద్ధత, సేవలో నిస్వార్థత ఇవే ఆంజనేయస్వామి మనకు నేర్పే గొప్ప విలువలని, ఆ విలువలను ప్రతి ఒక్కరు పాటించి సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలి అన్నారు.ఆంజనేయస్వామి ఆలయాలు, మందిరాలు భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతత, ధైర్యం మరియు భక్తి భావనను కలిగించే పవిత్ర ప్రదేశాలుగా భావిస్తారని, అలాంటి వాతావరణం కలుగజేసే విధంగా టిట్కో కాలనీలో కాలనీవాసులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. ఆంజనేయ స్వామి వారి దర్శనం అంటే కేవలం కోరికలు కోరుకోవడం మాత్రమే కాదు, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని, ధర్మ మార్గంలో నడవడానికి ప్రేరణ పొందడం అనే భావన కలుగుతుంది అన్నారు. ధర్మం పట్ల నిబద్ధత, సేవ లో నిస్వార్థత తెలియజేసే ఆంజనేయస్వామి విగ్రహాన్ని టిట్కో కాలనీవాసులు ప్రతిష్టింపజేసి ప్రతినిత్యం పూజించడం ద్వారా ఈ టిట్కోకాలనీ మరింత అభివృద్ధి చెంది ఈ కాలనీలో నివసిస్తున్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆంజనేయ స్వామి వారిని ప్రార్థిస్తున్నట్లు గొర్రెపాటి గోపీచంద్, పి. వి. ఫణి కుమార్ లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిట్కో కాలనీవాసులు కోటేశ్వరరావు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగునికి రూ.1.50 లక్షల కృత్రిమ కాలు పంపిణీ

పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో ఎన్ ఆర్ ఐ చలమలశెట్టి బాలాజీ సాయం



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో మచిలీపట్నం మండలం కరగ్రహారానికి చెందిన దివ్యాంగుడు బెల్లంకొండ వెంకటేశ్వరరావుకు రూ. 1.50 లక్షల విలువైన అత్యాధునిక కృత్రిమ కాలును మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు.దాత చలమలశెట్టి బాలాజీ సౌజన్యంతో ఎన్ ఆర్ ఐ జనసేన పార్టీ శాఖ ఈ కృత్రిమ కాలుకు ఆర్థిక సహాయం అందించింది. గత ఏడాది గరాలదిబ్బలో ఒక దివ్యాంగునికి కృత్రిమ కాలు అందించిన వీరు, ఈ ఏడాది మైత్రి ఫౌండేషన్ భాగస్వామ్యంతో వరుసగా రెండో ఏడాది ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణుకుమార్ మాట్లాడుతూ, దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్ ఆర్ ఐ జనసేన, దాత చలమలశెట్టి బాలాజీ ముందుకు రావడం అభినందనీయమని, బాధితుడిని విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లి కొలతల నుండి అమరిక పూర్తయ్యే వరకు మైత్రి ఫౌండేషన్ శ్రమించడం సంతృప్తినిచ్చిందని అన్నారు.జనసేన పార్టీ నాయకులు వడ్డీ చిరంజీవి మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ సేవా సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి జనసైనికుడు సమాజ సేవలో భాగస్వామి కావడమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వడ్డీ చిరంజీవి, పవన్, శ్రీకాంత్, నాగరాజు, మైత్రి ఫౌండేషన్ సభ్యులు సుధీంద్ర కుమార్, స్థానిక జనసైనికులు, మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. లబ్ధిదారుని కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి కోసం మేయర్లు చైర్మన్ల పదవులు విద్యావంతులకు అవకాశం ఇవ్వండి.

అన్ని రాజకీయ పార్టీలకు లంకిశెట్టి విజ్ఞప్తి.



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ అతి త్వరలో జరగబోయే కార్పొరేషన్, మున్సిపాలిటీ,జిల్లా పరిషత్ ఎన్నికలలో మేయర్లు చైర్మన్లు పోస్టులకు విద్యావంతులను ఎంపిక చేయాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ కె.పవన్ కళ్యాణ్ కు వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు వై జగన్మోహన్ రెడ్డికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కు మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మచిలీపట్నంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చాలా కాలం తర్వాత చైర్మన్లు మేయర్లు పోస్టులు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నికల విధానానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం స్వాగతించ దగిన విషయమని బాలాజీ అన్నారు.అయితే జిల్లా పరిషత్లు, కార్పొరేషన్లు మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే అధ్యక్ష స్థానంలో విద్యావంతులని ఎంపిక చేయాలని బాలాజీ అన్నారు. స్థానిక సంస్థల అభివృద్ధితో పాటు కౌన్సిల్ నిర్వహించే సామర్థ్యం, మినిట్స్ రాసే విజ్ఞానం, ప్రభుత్వ జీవోలను చదివే విద్య కూడా ఎంతకన్నా అవసరం అని అన్నారు. నిధులు కోసం రాష్ట్ర స్థాయిలోనూ జాతీయ స్థాయిలోనూ జరిగే మేయర్లు చైర్మన్ సదస్సులో పాల్గొని మాట్లాడడానికి కనీసం రెండు భాషలైన తెలిసి ఉండాలని బాలాజీ అన్నారు. వర్గ రాజకీయాల కోసం కులాల కుంపట్ల కోసం అర్హత లేని వారిని తమ స్వార్థం కోసం అభ్యర్థులుగా ఎంపిక చేస్తే చివరకు నష్టపోయేది స్థానిక సంస్థలు మరియు ప్రజలే అనే విషయాన్ని మర్చిపోకూడదని బాలాజీ అన్నారు.. అభ్యర్థుల ఎంపిక లో ఎమ్మెల్యేలు, ఎంపీల జోక్యం ఉండకూడదని వారి స్వార్థ రాజకీయాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులను పైకి రాకుండా చేస్తున్నారని బాలాజీ అన్నారు. గతంలో ఎన్టీఆర్ విద్యావంతులకు లాయర్లకు డాక్టర్లకు ఇంజనీర్లకు చట్టసభలలో అవకాశం కల్పించి రాజకీయ పరిస్థితిని ఉన్నతంగా తీసుకొన్న విషయం అందరు ఆదర్శంగా తీసుకోవాలని బాలాజీ అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టి, అర్హత గల వారిని అధ్యక్ష స్థానంలో కూర్చోబెడితే పదవికే వన్నె వస్తుందని న్యాయం జరుగుతుందని స్థానిక సంస్థలు అభివృద్ధి చెందుతాయి అని బాలాజీ అన్నారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీ నాయకులకు లంకిశెట్టి మెయిల్స్ ద్వారా తెలియపరిచారు

## వేమవరం కొండలమ్మ అమ్మవారిని దర్శించుకున్న 20 వేల మంది భక్తులు

చిత్తూరు జిల్లా జడ్జి అరుణ సారిక ప్రత్యేక పూజలు



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 20 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాలపొంగళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ చైర్మన్ ఈడే



వెంకట విష్ణు మోహనరావు, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు వడ్లమూడి రవీంద్రబాబు, తూము రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శానిటేషన్, దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. గుడ్లవల్లేరు ఎస్ఐ మరియు సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు.అదేవిధంగా ఆదివారం అమ్మవారి దేవస్థానానికి చిత్తూరు జిల్లా జడ్జి శ్రీమతి అరుణ సారిక విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందజేశారని కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## స్మశానంలో జంగిల్ను తొలగించి పుణ్యం కట్టుకోండి

-మా స్మశానాన్ని పట్టించుకోండి సారూ ...! ఘంటసాల,



శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన స్మశానం కృష్ణానది ఒడ్డున 3 ఎకరాలు స్థలంలో ఉంది. ఆ స్మశాన స్థలం ఆక్రమణ గురికాగా సుమారుగా 1.50 సెంట్లు మిగిలింది. గ్రామంలో ఎవరైనా చనిపోయినప్పుడు వారిని ఖననం చేయుటకు స్థలం లేక ముళ్ళ పొదలు తొలగించి ఖననం చేయాల్సిన పరిస్థితి వస్తుంది. గ్రామ పంచాయతీ గాని, రెవెన్యూ శాఖ కానీ ఏం చేయలేని పరిస్థితి. దయచేసి మా పరిస్థితిని అర్థం చేసుకుని స్మశానమును జంగిల్ తొలగించి మా సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ రాచూరి ప్రసాద్బాబు, ఎస్సీ కాలనీ వాసులు సంబంధించిన అధికారులను కోరుచున్నారు

## హతిరాముడు చిత్రపటానికి ఘన నివాళులు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని తెలుగురావుపాలెంలో మాజీ సర్పంచ్ కామ్రేడ్ జటావత్తు రెడ్డి రెండవ కుమారుడు జటావత్తు హాతి రాముడు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు నిడుమోలు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ పాటూరి రామయ్య హాజరై హాతిరాముడు చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. వారితోపాటు మాజీ సర్పంచులు రాచూరి ప్రసాద్బాబు, పైడిపాముల నెహ్రూ, జటావాతు బాలాజీ, స్టేట్ రవాణా జాయింట్ ఎన్. శివరామకృష్ణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి - వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా కార్యదర్శి శీలం నారాయణరావు

-200 పని దినాలు కల్పించాలి -మైక్రో ఫైనాన్స్ ఆగడాలని అరికట్టాలి



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :కృష్ణాజిల్లాలో ఎల్ ని నో ప్రభావం వలన సాగునీరు లేక వరిసాగు చేయటానికి రైతాంగం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలోకరువు సహాయక చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. గత రెండు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనటువంటి పరిస్థితి నేడు ఏర్పడిందని జిల్లాలో అన్ని మండలాల్లో ఎల్ ని నో ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గిపోయి కరువు ఏర్పడిందని అన్నారు. నిత్యవసర ధరలు కూడా భారీగా పెరిగినాయి, ఎరువులు ధరలు రెండింతలు పెరిగినాయి, పెరిగిన ధరలు అరికట్టాలని, రేషన్ షాపుల ద్వారా 16 రకాల నిత్యవసర వస్తువులు సబ్సిడీల తో కూడిన ధరలతో అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్న వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులు, పేదలకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కరువు సహాయంతో రూ 10,000/- లు కుటుంబానికి అందించాలని, గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్ ఆగడాలను అరికట్టాలని, డ్వాక్రా గ్రూపుల ద్వారా పావల వడ్డీ రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు..

## అచ్చంపాలెంలో వైభవంగా గంగానమ్మ వారి జాతర

-అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మండలి వెంకట్రామ్

-ఘనంగా సత్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని అచ్చంపాలెం గ్రామంలో నూతనంగా గంగానమ్మ అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఆదివారం తొలి జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలి జాతర సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనను మాజీ సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు, కమిటీ నిర్వాహకులు దాళినేని వెంకట మోహనరావు, కమిటి సభ్యులు ప్రత్యేకంగా దుస్సాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులను మండలి వెంకట్రామ్ సత్కరించటం జరిగింది.. ఏఎంసి చైర్మన్ తోట కనకదుర్గ, మాజీ సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు, కమిటీ నిర్వాహకులు దాళినేని వెంకట మోహనరావు, పూసల వెంకటేశ్వరరావు, జనసేన మండల ఉపాధ్యక్షులు సుగ్గన పవన్ కుమార్, జనసేన నాయకులు కాలారి ప్రసాద్, లంక శంకరరావు, దాళినేని అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద అగ్నిప్రమాద బాధితులకు చల్లపల్లి రెడ్ క్రాస్, రావెళ్ల ట్రస్ట్ సహాయం




ఘంటసాల, శ్రీవార్త న్యూస్ : మండల పరిధిలోని చిట్టూర్పులో నిరుపేద తల్లీ కుమార్తెలు లుక్కా రాణి - గంజి అనూషలు నివసిస్తున్న పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమై నిరాశ్రయులు కావటంతో బాధితులకు చల్లపల్లి రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్, రావెళ్ల కృష్ణ సేవాసమితి సాయమందించింది. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను చల్లపల్లి రెడ్ క్రాస్ ప్రతినిధులు పరామర్శించారు. కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా వచ్చిన వంటపాత్రలు, హెవీ టార్పాలిన్, రగ్గును అందచేశారు. రెడ్ క్రాస్ సభ్యులు, వీఆర్వో పరిశ కిరణ్ కుమార్ సహకారంతో నిత్యావసర సరుకులు ఇచ్చారు.బాధితుల పరిస్థితిని మిత్రుల ద్వారా తెలుసుకున్న రావెళ్ల కృష్ణసేవాసమితి ఛైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ స్థానికంగా లేకున్నా తక్షణం స్పందించి రూ.5వేల సహాయాన్ని చల్లపల్లి రెడ్ క్రాస్ ప్రతినిధుల ద్వారా అందించారు. డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, చల్లపల్లి రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ఛైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, సభ్యులు ఆకురాతి హరిప్రసాద్, బెల్లంకొండ హరిప్రసాద్, బత్తుల ప్రసాద్, బళ్ళా మధుసూదనరావు, ఘంటసాల సభ్యుడు కావూరి సాల్మన్, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం.....జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ ఈ నెల 7వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు ఎవవనిశీఖిఎ.ఖజా.ప్రశీజ.ఱఅ వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.అలాగే అర్జీదారులు క్యూఆర్ కోడ్ ద్వారా కూడా స్పందన తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఆర్టీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయికావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.




## శృతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పామర్రు శ్రీ వార్త న్యూస్ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా స్థానిక శృతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది . ఆసుపత్రి ఎండి, ప్రముఖ ఆంకాలజిస్ట్ సర్జన్ డాక్టర్ కే.ఎల్.ఎన్. శృతి స్వీయ పర్యవేక్షణలో ఈ శిబిరాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అమీన్ పాల్గొని నరాల బలహీనత, పక్షవాతం, వెన్నునొప్పి తదితర సమస్యలతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా మహిళలకు ప్రత్యేక పరీక్షలు, బీపీ, షుగర్ స్క్రీనింగ్ నిర్వహించి వ్యాధుల పట్ల, ముందస్తు జాగ్రత్తల పట్ల ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు.హాస్పిటల్ సీఈఓ కాటంనేని శేఖర్ మాట్లాడుతూ,ప్రజలలో ఆరోగ్య స్పృహ పెంచేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత, హాస్పిటల్ వైద్య బృందం మరియు సిబ్బంది పాల్గొని రోగులకు సేవలు అందించారు.

## జవారుపేట ఫత్తులబాద వంతెన యాదవుల వీధిలో ఘనంగా గంగానమ్మ సంబరాలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ ఈ సందర్భంగా ఖాజాగద్దంరాజు మాట్లాడుతూ శ్రావణమాసంలో గ్రామ దేవత అయినగంగానమ్మకు చలినైవే ధ్యాన్ని సమర్పించి అనంతరం భక్తులు తమకు తోచిన విధంగా మొక్కులు తీర్చుకుంటారని అనాదిగా వస్తున్న ఆచారాన్ని ఐకమత్యంగా కొనసాగిస్తూ శ్రావణమాసం ముగింపు సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులు తమకు తోచిన విధంగామొక్కుబడులు సమర్పించారని తెలిపారు ఆదివారం గంగానమ్మ సంబరాల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ స్టేట్ మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ ఖాజా జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షులు గద్దంరాజు గంగానమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో చిట్టి బోయిన జగన్నాథం, బోయిన కనకచింతయ్య,బట్రాజు వీరాస్వామి, తోట నాంచారయ్య,గద్దంకిషోర్, గద్దంస్వామి,గద్దంశంకర్, బట్రాజు శేఖర్,తోకలమల్లి గౌరిపర్తిరఘు,గంగులశ్రీనివాస్,బట్రాజు ప్రసన్న,బట్రాజు రమణ, సయ్యద్ సమీ, గద్దంరవి యాదవ యూత్ వింగ్ మహిళా యాదవ్ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు

## సత్య సాయి శత జయంతి వేడుకలు - పట్టణ స్థాయి పద్య సూక్త పోటీలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతవర్ష జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా మచిలీపట్నం ఈడేపల్లి సత్య సాయి మందిరంలో శనివారం పట్టణ స్థాయి "శ్రీ సత్య సాయి పద్య సూక్త" పోటీలు ఘనంగా నిర్వహించారు.శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు సూచనలు, రాష్ట్ర విద్యా విభాగం సర్కులర్ ప్రకారం పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు పట్టణ స్థాయి పోటీలు నిర్వహించినట్లు సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ తెలిపారు.స్వామి వారు చెప్పిన పద్యాలు మానవతా విలువలను పెంచుతాయని, వాటిని విద్యార్థులకు నేర్పడం శుభ పరిణామమని ఆయన అన్నారు. పట్టణ స్థాయిలో గెలుపొందిన వారి వివరాలను పాఠశాలలకు తెలియజేసి త్వరలో బహుమతి ప్రధానోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యా విభాగ సమన్వయకర్తలు పి. కళ్యాణి, పి. వరప్రసాద్, సమితి సమన్వయకర్త అనుమకొండ వెంకటేశ్వరరావు, సోమేశ్వరి దేవి, ఎం.బి. రామ్మూర్తి, కొట్టి నాగమణి, పలు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001